శ్రీమత్పరదేవతాయై నమః

లక్షణాపరిణయము

★

శతావధానులైన

తిరుపతి వేంకటేశ్వర కవులచే

రచింపఁబడినది.

★

ప్రకాశకులు :

చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి సన్సు

వేంకటేశ్వరపల్లి కేషన్సు

కడియము P.O.

తూర్పు గోదావరి జిల్లా.

1956

ఇది శ్రీకృష్ణుని అష్టవిధ పట్టమహిషీమణులలో
నొకామెయగు లక్షణాదేవి — వివాహ
ప్రసక్తిగల — గ్రంథము. ఆశు
ధారలో పూర్తిగావింపబడిన
మూడు ఆశ్వాసముల
ప్రబంధము.

పరిష్కర్త - విద్వాన్

చెళ్లపిళ్ల దుర్గేశ్వరశాస్త్రి

కడియం P. O. తూ॥ గో॥ జిల్లా.

ముద్రితము:

వేంకటేశ్వర ప్రింటింగ్ ప్రెస్
ఆలమూరు, తూర్పుగోదావరిజిల్లా.

శ్రీరస్తు.

శ్రీమత్పరదేవతాయైనమః

లక్షణాపరిణయము

ప్రథమాశ్వాసము

శా. శ్రీరామామణి జానకీరమణియై సేవింపఁ దమ్ముల్ సదా
గారాబమ్మునఁగొల్వ నెల్లయెడలన్ గల్యాణముల్ మీఱ సు
శ్రీరంజిల్లునయోధ్య నేలికొను నా శ్రీరాముఁ డెల్లప్పుడున్
శ్రీరామాధిపు నాత్మనామధరు రక్షించున్ గృపాశాలియై. 1

సీ. సత్త్వరజస్తమశ్శక్తులలో సత్త్వ
శక్తియౌ లక్ష్మియంశమునఁ బొడమి
యాత్మానుగుణగుణాఢ్యమ్మగువృత్తిఁజె
న్నారు విదేహగేహమునఁ బెరిఁగి
తమము ప్రధానమై తనరెడుశివువిల్లు
విఱిచిన శ్రీరాము వరునిగఁ గొని
రాజసంబణఁచి యరణ్యమేగెడి భ
ర్తకనుకూలయై వెంట నరిగి రావ
తే. గీ. ణాదులనుగ్రాఁచి జగముల యార్తిఁద్రోచి
భర్తతోడఁ గుబేరపుష్పకము నెక్కి
మరల సాకేతమేలంగ మరలివచ్చు
సీత శ్రీరామవిభునకు సిరు లొసంగు. 2

శా. శ్రీ కెంగేల నెసంగు రాచిలుకఁ బేర్మిన్ జూచి ముద్దాడి "నా
బాకీ తీర్పు" మటంచు మైనిమిరి దువ్వన్, జిల్క "యక్కా! యదే
మో కృష్ణుండనె వింటె" యన్న నగు మా మోమున్ విలోకించు నా
శ్రీకాంతుండు కృతార్థుఁ జేయుత యశోర్థిన్ రామభూమీపతిన్. 3

ఉ. "కల్లలుపన్ని నన్విడిచి కానలలో నల చెంచుబోటితో
నల్లరి సేయుదే'' యని యొయారముగా మగనేత సేయుచో
నల్లనఁ జెక్కుఁగొట్టి "యకటా ! కడునొచ్చితి'' వంచు నవ్వు మా
పల్లవపాణి యోగ్యనకు భాగ్యము లిచ్చుత రామశౌరికిన్. 4

మ. నెనరుం జిల్కఁడు ముద్దుపల్కులను శ్రీనీలాచలోష్ఠామృతా
దనసారస్యము గానుపింప నిజభక్త శ్రేణి గీర్తింపఁగా
ననురాగమ్మునఁ దాటికొండనగరిన్ హాళి న్నివాసమ్ముచే
సిన యిల్వేలుపు వేంకటేశ్వరుఁడు వాసిన్ బ్రోచు రామాధిపున్. 5

సీ. ఐదుమోములజంగమయ్యపూవుంబోఁడి
యాఱుమోములవానియసుఁగుఁదల్లి
కలిమికోమలి పల్కువెలఁదుల్ గొలుచుదేవి
కడిమితోఁట నెసంగుకలికిమిన్న
పోతురక్కసునితోఁ బోరాడిన నెలంత
జేజేలనరసి ప్రోచెడి పడంతి
పూఁపజాబిల్లి పూవుందాల్చినవెలంది
జగములన్నియుఁ బ్రోవఁజాలుజాణ
తే. గీ. మంచుగుబ్బలి రాచూలు మించువన్నె
వలువఁగట్టిన యెలనాఁగ చలువచూపు
కోపులన్ జూచి రక్షించు గోకిరెడ్డి
వంశమణియైన శ్రీరాము వల్లుధాము. 6

శా. "నాకై ఘోరతపమ్మొనర్చి తుద కన్యాయమ్ముగా నా తప
శ్శ్రీకిన్ భంగముకూర్చి కోరి తపు డిస్సీ ! యింత మాత్రాన కే
లా? కోప" మ్మని దీనుఁడయ్యు సతియల్కన్ బాపి నవ్వించు గౌ
రీకాంతుండు కృపాళుఁడై మనుచుతన్ శ్రీరామభూమీశ్వరుణ్. 7

మ. పతిచే మున్నుగ సామవేదము పఠింపన్జేసి యామీఁదఁ ద
ద్గతి వీణన్ బలికించి నేర్పుమెయి శుద్ధశ్రోత్రియుండైన త

త్పతికిన్ గానరసంబు నేర్పఁ దన గీతప్రౌఢిమన్ జూపు భా
రతి వాక్పాటవ మిచ్చి ప్రోచుఁ గృపమీఱ రామభూనాయకున్. 8

సీ. ఒక మోము భారతీ వికచాంబుజాస్య వా
తెఱఁజిల్కు తీయనితేనెఁ గ్రోల
నొక మొగం బాపడంతుకతోడ సరస స
ల్లాపమాధుర్యంబు చూపుచుండ
నొక మొగం బావెలందుక తావిఁజిల్కు పు
క్కిటివీటితమ్మ పుక్కిటవహింప
నొక మొగం బానెలంతుకతోడ రతికలా
విషయికోపన్యాసవిధులు దెల్ప
తే. గీ. నొక్కమధురోష్ఠ పానముదక్కఁ దక్కు
కృతులఁ బ్రతిసేయనేరని యింతిమిన్న
బిట్టు కౌఁగిలి గిలిగింత నెట్టుకొన్న
నలువ కృతిపతి కాయువు కలిమిఁబెంచు. 9

తే. గీ. కృతిపతి యొనర్చునట్టి సత్కృతుల కంత
రంతరాయమ్ము లొడఁగూర్ప కలరుకొఱకు
మొదటఁ జెల్లింపవలసిన మ్రొక్కు లొసఁగి
వేఁడికొందుము మాబొజ్జవేల్పుదొరను. 10

తే. గీ. కాళిదాస మయూరాది కవులు నన్న
యాదులు కవులు చేసిన యట్టి కావ్య
ములఁ జదివి కైత చెప్పఁగ మొదలువెట్టి
సలుపకుందుమె ? తన్నమస్కారమేము. 11

తే. గీ. అన్నవస్త్రము లొసఁగి విద్యలను శిష్యు
లకు ననుదినమ్ము చెప్పు విలక్షణప్ర
భావు భావుకభావు మాపాలిదేవు
బ్రహ్మ గురువర్యుఁ గొల్తు మపారభక్తి. 12

తే. గీ. ఏచతురు లోర్వలేమి పిసాచులెలమి
సత్కవులమీఁదఁ బడకుండ సలిపి రట్టి
కుకవులకు వందనమ్ములు కోట్లకొలఁది
స్థిరతరమ్మగుభక్తి రచింపవలదె! 13

ఆ. వె. గ్రంథచోరులైన కవులార! మాపద్య
ములను దొంగిలింప వలదు వినుఁడు
మాదుకైత కొక్క మాఱువేసము వైచి
మార్చికొంద మన్న మాఱఁబోదు. 14

ఉ. ఆఁకలిఁ దీర్చికొం బెవరికైనను ధర్మమ కాన బైటి పు
ల్లాకులవంకఁబోయి యట నాఁకలి తీర్చికొనుండు లోనికిం
బోకుఁడు; పోతిరేనిఁ గడుముప్పగు; మీచిరజీవిభావ మో
కాకవులార! మీకుఁ జిరకాలము పాయకయుండుఁ గావుతన్. 15

ఆ. వె. మచ్చరమ్మువిడిచి మాకవిత్వరసమ్ము
గ్రోలిరయ్య! మెచ్చుకోలుగలిగి
యోర్వలేమి నేడుపొంద మీకన్నీర
పోవుఁగాని యేమిపోవుమాకు? 16

క. "అవిలే వివిలే" వనిమా
కవనము నిందింత్రుగాక కవులందఱకున్
జవిగల్గుకృతుల నొనరిం
ప విరించిప్రమదకైన బరువగుఁగాదే. 17

చ. పలువురు సత్కవిత్వ మది పాల్పడకుండినఁ గొన్ని పుస్తక
మ్ములు రచియించి సిగ్గిలక మోదము నొందుట తప్పుగాదు; పు
త్రులు తన కుద్భవించినఁ "గురూపులు కాఁగల" రంచు భార్యతోఁ
గలయికమానునే? సుతులఁగాంచకయుండునె? రూపహీనుఁడున్. 18

సీ. ప్రియురాలి పాలిండ్లబిగు వెఱింగినవాఁడు
జిగికైతయందలి సొగసెఱుంగు

రుచిరాస్య కెమ్మోవిరుచు లెటింగి
నవాఁడు రసకవిత్వంపు సారస్యమెఱుఁగు
పద్మాక్షి చూపుసోవల నెటిం
గినవాఁడు తీక్ష్ణకవిత్వంపుఁ దేటయెఱుఁగు
పలువెలందుకల కౌఁగిళు లెటిం
గినవాఁడు మిశ్రకవిత్వప్రమితు లెఱుంగు

తే. గీ. నంధతమసాభిసారికాగంధ మెఱుఁగు
వాఁడె యాళుకవిత్వంపు జాడయెఱుఁగుఁ
గాని యన్యుల కెఱుఁగ శక్యమ్ముగాదు
భావవిజ్ఞాన మది పయిపైనిఁ గలదె! 19

క. లలితప్రబంధముల లో
పల యమకముఁదూర్చి రసము పాడొనరింపన్
వలయునె? పెరుగునువడ్లును
గలపోసిన ముచ్చటగునె? కవివరులారా, 20

చ. మతిగలవారి కేనియుఁ బ్రమాద మెలర్పక పోదు; పుష్పస
మ్మితకవితాలతాంగిని రమింపుఁడు కేవలశాస్త్రులార! మీ
మతులకు వచ్చినట్లు రసమాధురిఁ గ్రోలుఁడుగాని వ్యర్థపుం
జతురిమఁజూపి దాని స్తనశల్యపరీక్ష యొనర్పబోకుఁడీ. 21

వ. అని శిష్టాచార ప్రశంసలొనర్చి.

మ. ప్రతిసంవత్సరమాఘమాసమున గద్వాలప్రభుం డిచ్చు ను
న్నత సత్కారపు వార్షికమ్ముఁగొని. కౌన్నాళ్ళచ్చటన్ రాజబం
ధుతతుల్ సత్కవితాదరుల్ మిగుల సంతోషమ్ములన్ దేల్ప ను
న్నతటిన్ దన్నృపుస్యాలకుండు కడుసన్మాన్యుండు స్నేహార్ద్రుఁడై. 22

వ. భక్తితాత్పర్యమ్ములిగురింప నస్మత్కృత సంస్కృత గ్రంథమ్ముల యం
దలి శ్లోకమ్ములను నాంధ్ర ప్రబంధమ్ముల యందలి పద్యమ్ములను
దదేకాయత్తచిత్తమ్మున సానుజుండును సపుత్రమిత్రుండునునై వినుచుఁ
జుట్టువారియున్న పండితకవిసంఘము దిక్కు మొగంబై. 23

సీ. గద్వాలరామభూకాంతుని యిల్లాలు
గారాపుఁ జెలియ లేఘనయశునకు
సౌమిత్రికన్న నచ్చపుభక్తి యుక్తిఁ
జెన్నారు రాజారెడ్డి యనుజుఁడెవని
కట్టిఁడిట్టిఁ డటంచు ననరానిమేటి
తిమ్మారెడ్డి యెవనికి మఱొకతమ్ముఁ
డత్యంతసత్కవిత్వాదరుండైన
లక్ష్మారెడ్డి యెవ్వాని మాతులుండు
తే. గీ. చిన్నతనమంద కృతులకుఁ జేతులొగ్గు
నిపుణబుద్ధి సీతారామనృపతి సార్వ
భౌముఁ డెవ్వానికి నుంగు భాగినేయుఁ
డతఁడు శ్రీరామనృపతి పండితహితుండు. 24

క. శ్రీతాటికొండ పురమున
నేతాదృశగరిమనేలు నీతిపరుఁడు వి
ఖ్యాతుం డతిశాంతుఁడు వి
ద్యాతిశయం బెఱుఁగుజాణ యనుపమరక్తిన్. 25

చ. తిరుపతివేంకటేశ కవిధీరుల మమ్మునుగాంచి వాక్యచా
తురి మెఱయంగ నిట్లనె "బుధుల్ బళిరేయన మీరు గ్రంథముల్
విరచనచేసి యుంటిరి ప్రవీణతమై మఱియెన్నియేని, యం
దరయఁగ నాకు భాగవత మన్నిఁటికిం దలమానికంబగున్. 26

శా. స్వామీ ! మీకవితాప్రవాహము జగద్వ్యాఖ్యంబు మాబోఁట్లు త
త్సామర్థ్యం బిదమిద్ధమంచు వచియింపన్నేర్తురే ! లక్షణా
భామన్ గృష్ణుఁడు పెండ్లియాడుకత నాపైఁ బేర్మిమీఱం గృతిం
గా మిమ్ముం దయఁ జెప్పవేఁడెదను సత్కారమ్ము తోరమ్ముగన్. 27

చ. తిరుపతివేంకటేశ్వర సుధీమణులార ! కవీంద్రులార ! దు
స్తరతరబుద్ధిభాక్శతవధానవిధానపటిష్ఠులార ! భూ

వరహితులార! యెక్కడు కృపామతి నాళుగ మాకు లక్షణా
పరిణయమున్ రచింపవలెఁ బండితమండలి కింపుగావలెన్. 28

మ. కవితాకన్యక లెందఱేనిఁ గల రిక్కాలమ్మునం దల్ల వా
రు విచారింపఁగ గ్రుడ్డికన్నుగలవారో, కుంటివారో, సురూ
పవిహీనాత్మలొ కాఁగలారు; వివరింపన్ సర్వసంపన్న మీ
కవితాకన్య యటంచు నొక్కి పలుకంగా నేర్తు మిమ్మాటికిన్. 29

తే గీ. చెన్నపురి రాజధానిలోనున్న రాజ
వరులు నైజాములోనున్న నరవరులును
మీ శతవధాన కృతులకు మెచ్చికాదె
బంగరు బిరుదులొసఁగిరి బహుమతులుగ. 30

ఉ. ఏనుఁగునెక్కినారు ధరణీంద్రులు మ్రొక్కఁగ నిక్కినారు స
న్మానములందినారు బహుమానములం గ్రహియించినార లె
వ్వానిని లెక్కపెట్ట కనివారణ దిగ్విజయంబొనర్చి ప్ర
జ్ఞానిధులంచుఁ బేరుఁగొనినారలు మీరు కవిత్వసంపదన్. 31

శా. ఈయాంధ్రావనియందు మీక ననిభూమీశుల్. మిముం బూజలన్
జేయన్నేరని రాజచంద్రులును నాచే నక్షతుల్; వేయునే
లా? యీనాఁటికవీంద్రులం దెవరు విద్యాశక్తి రాజన్యరా
జ్యాయత్తంబగు పట్టపేన్గుపయి నాహాపుట్ట నూరేగిరే! 32

తే. గీ. హెచ్చుతగ్గులు తులఁదూఁప నెవరికన్న
హెచ్చు మాబావగారు; వారిచ్చినారు
మీకు బంగరుబిరుదు లమ్మేటిమేటి
వార్షిక మ్మిచ్చు మీకు నెవ్వరికి హెచ్చు. 33

తే. గీ. శ్రీకరుండగు నరసదీక్షితుని సుతుఁడు
సుకవియగు పాపశాస్త్రికి సోదరుండు
అస్మదాస్థానమునకు ధర్మాధికారి
బారయకు మీరనినఁ గడు గౌరవంబు 34

క. మాతండ్రిగారు మును కృతి
కై తామెంతేని యత్న మలరించిరిగా
నీ తగు కవి దొరకమిఁ ద
చ్చేతం బొప్పుకొనదయ్యెఁ జెప్పించుటకున్. 35

క. జనకుని కోర్కెం దీర్పని
తనయునిఁ దనయుఁడని చెప్పఁ దగదం డ్రిటుగా
వున నీకృతి కారణముగ
ననుఁ గృతకృత్యునిఁగఁ జేయ న్యాయ్యం"బనుచున్. 36

వ. వాగ్బహుమాన పూర్వకమ్ముగఁ దాంబూలంబు వెట్టుటయు నేమును నతని యోగ్యతకు నలరి యీవిభువతంసుండు తక్కు గుణములట్లుండఁ బిత్రినుజ్ఞాకరణ ధురంధరత్వమ్మునను నిజమ్ముగ రాముఁడే యగునని ప్రశంసించుకొనుచు నాతనివంశ క్రమంబుఁ గొండొక వివరింపఁ బూనితిమి. 37

క. సిరి యే చరణము పరమా
దరమున సేవించు నట నుదయమందెను శం
కరు తలపూతోఁబుట్టువు
ధర నుత్తమశూద్రకులము తగియెడివృద్ధిన్. 38

తే. గీ. కారణాంతరముల దానఁ గలిగె నెన్ని
యేనిభేదమ్ము లవి చెప్పనేల? నాఁడు
నేఁడు నిఁకమీఁద వికృతులజాడఁ దాఁ జ
ననిదియై యొప్పు నొక పాక నాటికులము. 39

ఆ. వె. క్షమకు సత్యమునకు సత్త్వమ్మునకు రాము
నాఁటివారు పాకనాటివారు
భోగభాగ్యములకు యోగమ్మునకుఁ గృష్ణు
నాఁటివారు పాకనాటివారు. 40

తే. గీ. వారి గోత్రములెన్నియో వఱలు నందు
గోకిరెడ్డియనెడి కాఁపు కులపురుషుఁడు

గాఁగలిగి యతిరాజసకలన మిగిలి
యొక్క తెగవారు బల్ సిరినొప్పుచుండ్రి. 41

చ. భరతునిఁబట్టి యిందుజులు భారతులైరి, రఘుండు హేతువై
పరఁగిరి రాఘవాఖ్య నలభానుకులప్రభవుల్, మహాయశ
స్కరుఁడగు గోకిరెడ్డి యతిశస్తగుణాకరుఁ డిందుఁగల్గుటన్
వఱలెను వానిపేర్గలిగి వంశము వీరి కసంశయమ్ముగన్. 42

క. అతిరాజస గోత్రావ
స్థితిచే నతిరాజసత్వసిద్ధి గలిగెనో ?
యతిరాజనులగు వీరలె
గతియగుదురొ గోత్రి మట్టిగతిఁ గాంచుటకున్? 43

గీ. తెలియుటతి దుర్లభంబని ధీరులెన్నఁ
దగిన యవ్వంశమందు ముత్యమ్మువోలె
రంగాధాత్రీవతంసుఁ డారంగ నుదయ
మంది ప్రజనేలె నిరతనిష్పందయశుఁడు. 44

శా. పొంగారంగల కీర్తి కెల్లయగుచున్ భూలోకదేవేంద్రుఁడై
సింగంబన్నను జీరికింగొనక విస్తీర్ణప్రతాపాప్తి నే
లంగల్గెన్ మఱినేల నర్థిజనులెల్లన్ దన్నుశ్లాఘింప, నా
రంగారెడ్డి గుణోత్తరత్వమది వర్ణ్యంబౌట కాశ్చర్యమే; 45

గీ. ఆతనికుమారు డత్యంతశీతలుం డ
నంతధరణీశుఁ డీతఁ డనంతయశుఁ డ
నంతసుగుణాకరుండు ననంతతేజుఁ
డగుచుఁ బాలించిమించె ననంత నెలమి. 46

గీ. ఆతనికిఁ బుత్రిఁడయ్యెఁ దిమ్మావనీంద్రుఁ
డతఁడు పూర్వులఁబోలి రాజ్యమ్ము రామ
రాజ్యముగనేలి పుత్రికఁ బ్రాజ్యసుగుణఁ
గాంచెఁ గొండమ్మ యను నొక కాంచనాంగి. 47

క. శ్రీరమణు సాటిఁదగు రా
జారెడ్డికి నామె నిచ్చి సర్వోన్నతమౌ
తీరునఁ బెండ్లి యొనర్చి ధ
రారమణునిఁ జేసెఁ బిదప రాజ్యమ్మిడియున్. 48

గీ. జలధి నిల్లటముండిన శౌరిపోల్కె
హిమగిరి వసించు నల నగజేశు మాడ్కిఁ
దాటికొండ పురమ్మునఁ దా వసించి
మించి పరిపాలన మొనర్చె నంచితముగ. 49

క. ఆరామయందుఁ గనె సు
శ్రీరుచిఁదగు రామచంద్రిరెడ్డిన్ మఱి ల
క్ష్మారెడ్డిన్ గొమరులుగా
నా రాజారెడ్డి వంశ మతి వృద్ధిఁదగన్. 50

క. మాతామహకులగోత్రి
ఖ్యాతులు వీరైరి ఖాత్రిగల కన్యకనే
నాతిగఁ గొనఁదగుఁ గాదే
నీతిరగువారి నేమమిట్టిది యగుటన్. 51

సీ. ఇరువురు ప్రఖ్యాతికెల్లలై తగువార
లిరువు రాకృతిపొంక మెసఁగువార
లిరువు రర్థులకిచ్చు నిచ్చఁ బొల్చెడివార
లిరువురు విద్దెల నెఱుఁగువార
లిరువురు కవులచే నెన్నికగనువార
లిరువురు కనికరం బెనయువార
లిరువు రధర్మమ్ము నీసడించెడివార
లిరువురు శత్రుల నోరయువార

తే. గీ. లిరువురును దాతతండ్రుల సరణివార
లిరువు రన్యోన్యమును మైత్రిఁ బరఁగువార

లోక్కఁ యుగభేద మొక్కటిదక్కఁ రామ
లక్ష్మణులు రామలక్ష్మణుల్ లలితమతులు. 52

తే. గీ. వీర లాచారపరులు సుశ్రీరుచిరులు
వీరు లతిధీరు లత్యంత శూరు లధిక
బంధుపోషణతత్పరుల్ ప్రబలు లెంత
కేనిఁదగు చేవఁగల వార లిద్దయళులు. 53

ఆ. వె. రామచంద్రరెడ్డి రమణీమణుల కెల్ల
మేలుబంతి యనెడి మేల్మిగన్న
లక్ష్మమాంబికను సలక్షణమ్ముగఁ బెండ్లి
చేసికొనియె మిగుల వాసియెసఁగ. 54

సీ. మునికులగోత్ర సముద్భవుండగు ననం
తారెడ్డి యేగుణోత్తరకుఁదండ్రి
తనపేరు సార్థకత్వము వహింపఁ జరించు
రత్నమాసాధ్వి యేరమణితల్లి
తిరుగుళ్ళ పురమేలు నరపతి నారసిం
హారెడ్డి యేసతికన్న గారు
రాజమాన్యుఁడు మేటితేజోయుతుండు ల
క్ష్మారెడ్డి యేజగన్మాన్యతమ్ముఁ
తే. గీ. డట్టి శ్రీబుచ్చమాంబ గోపాంబ వీర
లిరువురును భార్యలై తనకెసక మెసఁగ
భోగదేవేంద్రుఁడై వృద్ధిఁబొందెనౌర
శ్రీయుతుండు లక్ష్మారెడ్డి ధీయుతుండు. 55

సీ. లక్ష్మిసరస్వతుల్ రహిసీడనఁగవచ్చు
నన్యోన్యమును మైత్రియమరెనేని
సాహితీగీతులు సరినాఁగఁదగు నేక
పురుషాశ్రయత్వంబు వఱలెనేని

శాంతిదాంతులతోడసాటిసేయఁగవచ్చుఁ
బైనొండు లోనొండుఁ బరఁగవేని
శ్రద్ధామనీషలు సరిచెప్పఁగావచ్చు
నన్యోన్యవైరుద్ధ్య మలరదేని
తే. గీ. అక్క చెల్లెండ్రునై సమానాకృతులయి
సవతులయ్యును భేదమ్ము లవము లేక
క్షీరనీరవిధమ్మునఁ జెలిమిగలిగి
డంబలరు బుచ్చమకును గోపాంబికకును. 56

క. ఆలక్ష్మి రెడ్డియు మఱి
యాలలనలలోన బుచ్చమాంబయును లస
చ్ఛీలుర ముగ్వురుగొమరుల
బాలిక నొక్కర్తుఁ గని రపారయశస్కన్. 57

క. శ్రీలక్ష్మిదేవియను న
బ్బాలిక తనపేరు సార్థపటిమ వహింపన్
బాల శశిరేఖయో యనఁ
గా లలివృద్ధిం దనర్చెఁ గళలలరారన్. 58

ఉ. ఆలలనా లలామ సుగుణాకరుఁడౌ గదవాలరామభూ
పాలునకిచ్చి పెండిలి యపారముదమ్మునఁ జేసి; రాపె స
చ్ఛీలము తన్మనోహరు ప్రసిద్ధియు నీగియు నిర్ణయింపఁగాఁ
జాలుట మాక కాదు జలజాతభవాదులకే నశక్యమౌ. 59

తే. గీ. ఈమెకన్నను జిన్నలై యెల్ల సుగుణ
ములను నెవ్వరికన్నను మొదటివార
లగుచు నలరారుచుందురు రాజావనీంద్రుఁ
డును మఱియుఁ దిమ్మనృపతియు ననుపమితులు. 60

క. ఇరువురు విద్యలలో ఘను
లిరువురు నాకారవంతు లిరువురు నన్నన్

గురుభక్తిఁగొల్చు గురుయశు
లిరువురు సంతానవంతు లిరువురు శాంతుల్. 61

మ. మతిమంతుండయి ఫారసీచదివి తిమ్మారెడ్డి ప్యాసయ్యె ను
న్నతమైనట్టి వకీల్పరీక్ష యిదియుండన్ దెల్గునన్ సత్కవి
ప్రతతుల్ మెచ్చఁగ నీతివాక్యపదపూర్వంబైన రత్నావళిన్
గృతితానై యొనరించె నమ్మహితునిన్ గీర్తింపఁగాఁ జెల్లదే. 62

క. వీరికినెల్లన్ జ్యేష్ఠుం
డై రాజిలు ననుపమానమగు శాంతికి తా
నై రామారెడ్డి మహా
ధీరుఁడు గంభీరుఁడును సుధీమాన్యుఁడునై. 63

తే. గీ. ఫారసీభాష నెక్కుడు పండితుం డ
రేబియన్ భాషలోన నుత్కృష్టతముఁడు
తెల్గునం దెంతకేనియుఁ దెల్విగల్గు
వాఁడు వినయాదిగుణముల వీడితండు. 64

ఆ. వె. ధర్మసుతునకేనిఁ దప్పు వెదకవచ్చుఁ
గాని యితనియెడలఁ గానరాదు
ఇంత శాంతి దాంతి యింత యనుద్ధతి
యింత యోగ్యతయు మఱెందులేదు. 65

తే. గీ. కవులతో స్నేహమొనరించు ఘనుఁడతండు
కవులతో స్నేహమొనరించు ఘనుఁడితండు
భేదమిట్టిది యొక్కింత లేదయేని
రామవిభుఁ డనవచ్చు నీ రామవిభుని. 66

క. ఆరాముఁ డనంతాసుత
గారామునఁ బెండ్లియాడెఁగా; రాముఁడితం
డారామతల్లి పేరిఁటి
నారీమణిఁ బెండ్లియాడె నయవినయయుతన్. 67

క. ఎంతేనిఁ దనదుపెద్దలు
సంతసమునఁ బొదల రామజనపతి యాయు
ష్మంతుని సుశ్రీమంతు న
నంతాంబికయందుఁ గనె ననంతారెడ్డిన్. 68

—* షష్ఠ్యంతములు. *—

సీ. ఏతాదృశగుణాళిచేతఁ బొల్చెడివాని
కతులితవైభవం బలరువాని
కీవిచేఁ బ్రఖ్యాతి నెనసి వర్తిలువాని
కతిశుద్ధమగు చిత్త మమరువాని
కధికమౌ రసికత కాధారమగువాని
కఖిలవిద్యాశాలి యైనవాని
కెనలేని వినయంపు గనియైనవానికి
ధైర్యమెక్కుడు గల్గి తనరువాని
గీ. కభ్యుదయములు గల్గెడు నట్లు మేము
బుధులు ముదమందు గతిఁ జేయఁ బూను లక్ష
ణాపరిణయమనెడి ప్రబంధమ్మునకుఁ గ
థాక్రమం బివ్విధమ్మునఁ దనరుచుండు. 69

కథాప్రారంభము

ఉ. సిరికింబట్టు యశోవిభూతివిజయశ్రీశోభితాశాంతరుం
డరిరాట్కాననవీతిహోత్రుఁడు ప్రశస్తౌదార్యభాభాసురుం
డరుణన్యక్కరణక్రియాచణప్రతాపాలంబి సౌజన్యసు
స్థిరుఁ డస్తోకకలావిలాసుఁడు బృహత్సేనప్రభుండొప్పగున్. 1

ఉ. దాత మహానుభావుఁడు బుధప్రతతిం గరఁగించు వాఁడు ని
ర్ణేత సమస్తవిద్యల, కనింద్యచరిత్రుఁ డపాస్తశత్రుఁ డు
ద్ధూతసమస్తకల్మషుఁడు దూరవిచారణశీలుఁ డుత్తమ
ఖ్యాతిసమేతుఁ డానృపతికాంతునిఁ బోలగఁ జాల రొండొరుల్. 2

సీ. ప్రీతిలేనిసంపత్తిఁ బరిఢవిల్లుటెకాదు
విద్యావిశేషముల్ వెలయువాఁడు
అనుపమానఖ్యాతి నతిశయిల్లుటెకాదు
వినయాతిశయము శోభిల్లువాఁడు
అధికప్రతాపమ్మునంది యుండుటెకాదు
శాంతి దాంతులను మెచ్చఁదగువాఁడు
అప్రతిమాకృతి ననుగమించుటెకాదు
తల్లిఁగాఁ బరభార్యఁ దలఁచువాఁడు
తే. గీ. సకలసుకవిచకోరకనికరపూర్ణి
మాతుషారకరాయితామందవితర
ణక్రియాశాలి రాజన్యచక్రమౌళి
మానితపదద్వయుఁడు బృహత్సేనవిభుఁడు 3

సీ. సుకవి వచ్చెనఁటన్నఁ జూడనంపుటెకాని
మనకేమియని యూరకొనుటలేదు
విద్వాంసుఁ డనియన్నఁ బిల్వనంపుటెకాని
పోనిమ్మనుట మొట్టమొదలె లేదు

గాయకుం డనియన్న గారవించుటె కాని
నాస్తి పొమ్మనుట స్వప్నమునలేదు
యాచకుం డనియన్న నాదరించుటె కాని
యీసడించుట యెన్నఁడేనిలేదు
తే. గీ. ఎన్నిసార్లైన నడిగిన నిచ్చుచుంటె
కాని సున్నిడు టొక్కమాత్రైనలేదు
అనృతమాడుట మందునకైనలేదు
ఏనృపులుసాటి యా బృహత్సేనపతికి! 4

క. నయమా ప్రతిపదసంపదు
దయమా యామీఁద మత్తతత్త్రిపురా
డ్జయమా యదియునుగాక వి
నయమా వేతొకరుఁ డిట్లనన్ దాదృశుఁడే. 5

క. ఆ రాజేంద్రుని కొక్క కు
మారీమణి తనరు సకలమనుజేంద్రతనూ
జారత్నములకు నాపెకు
వార యరయ హస్తిమశకవైఖరి నొప్పున్. 6

తే. గీ. ఆసరోజాక్షి పుట్టినయది మొదలుగ
నఖిలశుభలక్షణమ్ముల నలరుకతన
లక్షణ యటంచుఁబల్కి రెల్లరును నత్త
లోదరీలక్షణము లెంత యొప్పునొక్కొ! 7

తే. గీ. ఆమగువ జన్మనక్షత్రమే మొకాని
పుట్టినదిగోలె శ్రీకృష్ణ పుణ్యకథలు
వినఁగ మది ముచ్చటంబడు వెన్నుఁడన్న
మాట విన్నంతమాత్ర సమ్మదముచూపు. 8

ఉ. ఆ యెలనాగ శైశవమునందున మేల్ రతనంపుఁ దొట్టెలోఁ
బాయనికూర్మినుంచి తగుపాటలు పాడెడివేళ "లాలి కృ

ష్ణా'' యన నాలకించి వదనాంబుజ మంకురితస్మితమ్ముగాఁ
గోయని మించి యాడునఁట, కోమలి జన్మవిశేషమెట్టిదో! 9

తే. గీ. పలు పలుకులేల, గరుడపక్షులు సయితము
సహజమగు కూజితమునఁ గృష్ణా యటన్న
నాలకించి వినోదాబ్ధి నోలలాడు
మతులెవరికైనఁ గర్మాను గతులుగావె! 10

క. కేవలలక్షణయయ్యును
నావెలఁదుక సర్వలక్షణాలంకార
శ్రీవెలయ సలక్షణయనఁ
గా వృద్ధింజెందె శీతకరరేఖ యనన్. 11

క. అలరులకు సౌరభమువలె
నెలకు శరత్సమయమువలె నీరదతతికిం
దొలకరిమెఱుపుంబలె న
న్నెలఁతకు లేజవ్వనంపునిగ్గులు దోఁచెన్. 12

సీ. ముసిముసి నగవులపస పసందుగఁదూఁగె
మొలకచూపులసౌరు తళుకుజిలికె
నడలందుఁ గడువింత జడిమ నూల్కొనసాఁగె
నెదవిస్తరించి పయ్యెదనుడాఁగె
నడుము నానాఁటికి నాదారుగాఁదోఁచెఁ
దొడలయందునఁ బుష్టి దొలకరించె
వాతెఱ వేఱొక్క వైఖరిఁ గననయ్యెఁ
జాతురి పల్కుల నూఁతగొనియె
తే. గీ. నంతకంతకు లావణ్యమతిశయించె
వింతవింత పనులయందు వేడ్కదొడరె
నంతిపురమున నుండు టభ్యాసమయ్యెఁ
గంతునకుఁ గాఁపురంబయ్యె నింతిమేను. 13

తే. గీ. జాఱుముడివైవఁ గట్టిపైఁ బచారుసేయు
జడఘటించిన మడమలఁ దొడరియాడుఁ
గొప్పువెట్టినఁ దలకన్న గొప్పగాంచుఁ
జొల్లెమిడుటొప్పదే యట్టి సుదతి కురుల. 14

మ. పరివేషమ్ములుగట్టి పూగశకలప్రాయమ్ములై యంత బం
గరుగోలీల నతిక్రమించి లికుచాకారమ్ములై పిమ్మటన్
సరసీజమ్ములమీఱి గట్టిపడి విన్నాణంపు బల్కుప్పలై
పరిమాణింప నశక్యమై యెసఁగె నప్పద్మాక్షివక్షోజముల్. 15

క. రదములను మల్లెమొగ్గలు
పొదలన్ లేఁజన్నులనెడి పూవుంగుత్తుల్
గదియ నునుఁ బల్కుకోయిల
రొదలొదవఁగఁ బుష్పసమయరూఢిన్ దనరెన్. 16

క. అంత వసంతము సంతత
దంతురితలతాంతమొప్పె దాంతవిరహిహృ
త్కుంత మతికాంతసకలా
శాంతము సంతోషకరనిశాంతంబగుచున్ 17

క. లేమావిగున్న చిగురుల
నామెయి మెసవంగఁ గోకిలాంగనలకు ని
త్యామోదప్రదమధుర
శ్రీమెఱయఁగఁ గంఠములకు జీరలు తెగియెన్. 18

క. అల కాల మెల్లరకు సమ
కలనన్ శాస్త్రప్రసిద్ధి గాంచినదయ్యున్
గలయికలులేక తగు కాం
తులకున్ గాంతలకు నిశలు దుర్దశలయ్యెన్. 19

ఉ. మామిడిపండ్లు పానకము మంజులతన్ దగు నిక్షుఖండముల్
భూమిసురాగ్రిగణ్యులకుఁ బూర్ణముగానిడి చందనమ్ము మై

నోమియు వీవనల్ విసరియున్ దనియింతురు పుణ్యవంతు ల
య్యామనియందు మాధవున కాదర మెంతయు మేదురమ్ముగన్. 20

క. అట్టియెడ బృహత్సేనుఁడు
దట్టములగు చూతములను దనరారి మణీ
కుట్టితకుట్టిమమై బల్
వెట్టన్నెట్టఁ దగునట్టి విరి లేఁదోఁటన్. 21

చ. చరమధరాధరమ్మునకు సన్నిధిలో నొకయింత దవ్వునన్
సరసిజమిత్రుఁడుండ భటసంఘము గొల్వఁగ నేగి వట్టివే
ళ్ళరుచినెసంగి సర్వశుభలక్షితమై యలరారునట్టి చ
ప్పరమునఁ గూరుచుండెఁ దగు పండితమండలి చుట్టువాఱఁగన్. 22

ఉ. గాయక గానముల్ సెలఁగఁగా రమణీయధనాంగనామణీ
గేయవిలాసనాట్యములొగిన్ మిగులన్ దగ స్వస్తివాచకా
గ్రియులు వేదఘోష మొనరింప నిలింపులకింపు నింపు న
ట్లాయతమైన సంపదల నానృపుఁడంత వదాన్యమౌళియై. 23

మ. మణులన్ వజ్రములన్ మహాంబరములన్ మధ్వాదులన్ మేటి ద
క్షిణలన్ భూసురవర్గముం దనుపుచున్ గేల్మోడ్చి యవ్వారికిన్
బ్రణతుల్ సల్పుచు వీవనల్ విసరుచున్ బాటీరపంకంబు వీ
క్షణరమ్యంబుగఁ బూయుచున్ స్రజములన్ గంఠమ్ములన్ వైచుచున్.

ఉ. ఉన్నయెడన్ సమస్తజగదుత్సవకారణమై సమంతతో
భ్యున్నతపన్నగప్రకరపోషకమై ద్రమిడాంగనాకుచ
స్విన్న పటీరసౌరభవిశేషపరీమళమై యెలర్చె సం
పన్నవిపన్నభూరిసుఖబంధురమై మలయానిలంబొగిన్. 25

క. అమలయానిల మొలయుట
చే మహిసురులును నృపాలశేఖరుఁడును భృ
త్యామాత్యాదిజనమ్ములు
నామోదరసాబ్ధిఁదేలు నాసమయమునన్. 26

సీ. కాషాయ వస్త్రమ్ము కటితటమ్మునఁ గ్రాలఁ
గాయమంతయు భూతి గడలుకొనఁగఁ
ద్రిదశాపగామృత్తు నుదుటిపైఁ జెలువార
మస్తకమ్మున జటామకుట మొలయ
దండక మండలుద్వయము కేలనెసంగఁ
బాదమ్ములందుఁ బావాలు దనరఁ
బేరురమ్మునఁ బద్మబీజమాలయెలర్ప
వీణియ బుజముపై రాణనింప

తే. గీ. నంబరమునుండి కృష్ణకృష్ణా యటంచు
సరససంగీతభంగీతసంగతులను
బాడియాడుచు నానందభరితుఁడగుచు
వచ్చె నారదుఁడా నృపవరునికడకు. 27

ఉ. వచ్చినమౌనిఁ గాంచి సభవారలవారణగౌరవంబుపై
పెచ్చుగ లేచి; రంతఁ బృధివీపతికల్పితపూజకెంతయున్
మెచ్చి మునీంద్రుఁ డాదరము మేకొనఁ దన్నృపమౌళిదత్తమౌ
పచ్చలగద్దెపై హరినిఁ బాడుచు వేడుక పిచ్చలింపఁగన్. 28

వ. సుఖాసీనుండై.

ఉ. ''నందకుమార! భక్తజననారకతారక! ద్వారకాపురీ
నందనచందనద్రుమ! సనాతననూతనగోపసుందరీ
బృందమిళింద! బంధురపరీమళధామమరంద! నీకిదే
వందనముల్ పదింబదిగ వందలువేలు పురందరార్చితా! 29

ఉ. ఇందుముఖీమనోజ! జగదీశ! రమేశ! విధీశనుత్య! ని
ష్పందయశోవిశాల! పరిపాలితసన్మునిజాల! సన్మనో
నందన! భక్తచందన! కనత్కనకాంబర! కృష్ణ! నీకిదే
వందనముల్ పదింబదిగ వారిజలోచన! పాపమోచనా! 30

క. చిక్కవు తపముల జపములఁ
జిక్కవు జన్మముల నేమిచేసిరొ! నీకా

టక్కరి గొల్లవెలందులు
చక్కఁగఁ జిక్కితివి వారిసందిళులందున్. 31

మ. అలినీలాలక భీష్మకన్య తొడపై నానందముం దెల్ప లీ
లలు చెన్నారఁగ సత్యభామ మధురాలాపమ్ములం దేల్ప ని
చ్చలు పైపెచ్చుగ నాసుదంత విడెమున్ జానొప్పనందీయ మె
చ్చులకున్ మెచ్చులొసంగు నీవిహృతికిన్ జోహారు జోడించెదన్. 32

శా. కోకల్ చంకనుబెట్టి గూఢగతిఁ దక్కంగొల్ల యిల్లాండ్ర బల్
వీఁకన్ వంచనచేసి పొన్నపయికిన్ వేంచేసి కూర్చుండి త
దాక్రికాపూర్ణనిశాకరాననల మర్మంబుల్ విలోకించు "నీ
జోకల్ లోకము మెచ్చుపోక'' లనుచుం జోడించి కేల్మ్రొక్కెదన్. 33

శా. రాకాచంద్రికనన్మయూఖతతిమీఱన్ జేరి కాళిందిలో
నేకాంతమ్ముగ గొల్లచేడియలతో నిచ్చల్ విహారింపఁ గొ
క్కోకాచారము దప్పకుండ ననుఁగుం గోపాలకుల్ సూడ స్వే
చ్ఛాకాంతంబయియొప్పు నీదయిన రాసక్రీడ కేమ్రొక్కెదన్." 34

క. అని మాటిమాటికిని న
వ్వనజాక్షుని చర్యలెల్ల వర్ణించుచు భ
క్తినిమీలితలోచనుఁడై
ముని వీణియమీఁదె రసము మోటలుగట్టెన్. 35

క. నెట్టికొని నారదుఁడు రస
ముట్టిపడన్ జలజనయను నొగిఁబొగడఁగ న
ప్పట్టునను బృహత్సేనుని
పట్టి వినియె వలపుకొంత పయిపయిఁబొంగన్. 36

వ. ఇమ్మెట నారదుండును బృహత్సేనుండును గొంతవడి నుచిత ప్రసంగ
మ్ములఁ గాలమ్ముఁ బుచ్చుచుండి రట్టియెడ నమ్ముని కెలననున్న లక్ష
ణంగాంచి నృపున కిట్లనియె.

ఉ. "ఈయెలనాఁగ పెండిలికిఁనీడయి తోఁచెడిఁ బెద్దలెల్ల నా
హాయనఁబోల్పు నూత్నమదనాంచిత నొక్క కుమారకుం జగ

ద్గేయునిఁ జూచి సర్వజనగేయముగా నిఁకనైనఁ బెండిలిన్
జేయక మిన్నకుంట తగునే? నరపాలకులావతంసమా!" 38

క. అన జనపతుఁ డిట్లను "నో
యనఘా! తగునట్టి నరవరాగ్రిణిసుతునిన్
జననుతుని మీరలారసి
వినిచిన నవ్వానికిచ్చి పెండ్లియొనర్తున్." 39

చ. అనవుడు మౌనియిట్లను "ధరాధిప! మౌనులమైనమాకు న
చ్చినపురుషుండు పాత్రికృతులు సెప్పెడివారలఁబోలె మీకు న
చ్చునొ, యటుగాదొ: నామదికిఁ జొప్పడువాని వచింతు నాతఁ డీ
క్కనకవిభాంగికిం దగినకాంతుడటంచుఁ దలంతునెంతయున్. 40

ఉ. ద్వారకనేలువాఁడు సముదారగుణాఢ్యుఁడు మేలువాఁడు నా
కారము చెప్పనేల! రతికాంతునిఁ గన్న మనోహరుండు దు
ర్వారరిపుప్రకాండమదభంజనుఁ డాతనికన్న మేటి యీ
ధారుణిఁ గాదు నాకముఖధామము లందుఁ గనన్ వినన్ జుమీ, 41

ఉ. ఆతని కాతఁడే పత్రితి సమస్తవిధమ్ములఁ ద్వత్కుమారికా
రీతియుఁ జూడ నాతనివరింపఁగ నెంచెడియట్ల తోఁచు మే
లీతరుణీశిరోమణికి నీడతఁ, డాపరిభూతశంబరా
రాతికి జోడు నీతనయ రాజవరేణ్య! యెఱుంగఁ జెప్పితిన్, 42

క. కాని యొకసందియము కల
దీనరలోకాధిపతుల కెల్లరకును న
మ్మౌనిజననుతుఁడు గొల్లఁడు
గాని నృపుఁడు గాఁడఁటంచుఁ, గలది వచింతున్. 43

క. నారాయణుండు ధరణీ
భారము వారింప యాదవకులమ్మునఁ జె
న్నారెన్ గృష్ణుండన నీ
కారసి తెల్పితిని గడురహస్యంబైనన్. 44

క. చకితులగు లోకులకు వెఱ
వకతీఱదు గాన నొకయుపాయము కడునె
న్నికయగుగతిఁ దెల్పెద వా
రక చాటింపుము స్వయంవరము జగమెల్లన్. 45

ఉ. నీకొమిరెన్ వరింప ధరణీపతులెల్ల రహంక్రియామదో
ద్రేక మెలర్ప రాఁగలరు; తెల్లముగా నపుడీవు మత్స్యయం
త్రాకలనమ్మునన్ జయమునందిన సుందరుఁడీ కుమారికన్
జేకొనునట్లుగాఁ బ్రతినచేయు ముపాయము న్యాయ్యమై తగన్. 46

ఉ. దానికిఁ గృష్ణుఁడొక్కరుఁడు దక్కఁ దదన్యు లశక్తు; లాతఁ డ
మ్మానిని జలమ్మునందుఁగని యుప్పరవీధిని మత్స్యయంత్రముం
బోనరుకంగలాఁ డతని పోడిమి యన్యుల కబ్బనేర్చునే
యానరరథ్యచోదకునికడ్డమె! యెంతటి రాజచంద్రులున్. 47

మ. జయలక్ష్మీలలనామనోహరుఁడు కృష్ణస్వామి నీపుత్రికిన్
బ్రియుఁడై యొప్పెడి నిక్కమియ్యది నృపుల్ పేరెత్తిపైవచ్చినన్
లయమొందింపఁగఁజాలకున్నె? శిశుపాలధ్వంసి నీకేల ని
ర్భయమౌరీతి నొనర్పుమిట్లు, శుభముల్ వాటిల్లు నాయానతిన్." 48

క. అనుపలుకులు విని నృపవరుఁ
డనుమోదముచెందె మౌనియరిగెం దనయి
చ్చను; లక్షణకున్ మన మ
మ్మనసిజజనకుపయి మాటిమాటికి బ్రాలెన్. 49

తే. గీ. అంత నరపతి పురమునకరిగె; లక్ష
ణాంగనామణి యంతఃపురాంతరమున
కేగెఁ; జెలికత్తెలందఱు నిండ్లుచేరి;
రరుణుఁ డరుణప్రభాంకితకిరణుఁడయ్యె. 50

—• ఆశ్వాసాంతపద్యములు •—

క. ఫార్షీభాషాప్రజ్ఞో
త్కర్షాకర్షితయశోధికా ! శంకరసం
కర్షణసమబుద్ధియుత ! య
మర్షస్వీకృతివిరహిత ! మానితచరితా ! 51

స్రగ్విణి. పాకనాట్యన్వయా ! బంధురాలంక్రియా !
శ్రీకళత్రాంఘ్రి సంసేవనాప్తోదయా !
గోకిరెడ్డ్యాప్తసంగుప్తకీర్తీ ! గుణా
లోకనైకప్రియా ! లోలుభత్వాప్రియా ! 52

పంచచామరము.

ధరామరస్థిరాదరా ! వృథావిధోక్త్యనాదరా !
నిరంతరానురక్తి చిహ్నా ! నిత్యపోషితప్రజా !
పరాభిధేయవస్తుతత్త్వపండితా ! యశోన్వితా !
ధరావరేశ్వరా ! సమస్తధర్మమర్మభాస్వరా !

— గద్య —

ఇది శ్రీతిరుపతివేంకటీయ లక్షణా పరిణయంబను
మహాప్రబంధమ్మునందుఁ బ్రథమాశ్వాసము

శ్రీరస్తు.

శ్రీమత్పరదేవతాయైనమః

లక్షణాపరిణయము

ద్వితీయాశ్వాసము

క. శ్రీకర ! లోకోన్నతసుగు
ణాకర ! యౌవనకలావిహార ! సుకవితా
పాకవివేకముగల కవి
రాకకలరు వేల్పుగిడ్డి ! రామారెడ్డీ ! 1

తే. గీ. అవథరింపు మనంతరంబబ్జబంధు
నందు రాగాతిశయ మెక్కుడై చెలంగె
స్వగతుఁడగు హరి వరుఁగఁగోర గమకించు
లక్షణకు గల రక్తిఁదెల్పనో యనంగ. 2

క. అంబుజబంధుఁడు పూర్ణత
రంబై యర్ధమయి కొంతరాజించియు సూ
క్ష్మంబై తగు బింబమునఁ గ్ర
మంబుగఁదాఁ బశ్చిమాద్రిమాటున కరిగెన్. 3

క. హరిదశ్వుఁడు తనగృహమున
కరుదెంచె నటంచుఁ బశ్చిమాంబుధి మణులన్
గరమునఁ గానుకొసంగఁ ద
దరుణచ్ఛవిఁ బొల్చెననఁగ నరుణుం డెసఁగెన్. 4

తే. గీ. పశ్చిమాచలమునఁ గాంతి పరిఢవిల్లెఁ
గాని తూరుపుఁగొండ రిక్తదశనందె;
"నొకఁడు చెడిపోవుపైఁగాని యొకఁడు బాగు
పడుటలే; దని జను లాడుపలుకు నిజము. 5

తే. గీ. వారకాంతనువదలి యంభోరుహాప్తుఁ
డరిగినంతన యద్దాని నంటుకొనఁగఁ
దమ మరుగుదెంచె, వారకాంతలకుఁ దగిన
వాఁడు వీడిన దురవస్థ వచ్చుటరుదె! 6

ఉ. అంబుజముల్ చలించెఁ, బతగావళి గూళ్ళకుఁ జేరవచ్చెఁ, దీ
రంబులనుండి విప్రులు కరంబుల డంబుగ నీరుకావివ
స్త్రంబులు సంపుటంబులు పొసంగ గృహంబుల కేగుదెంచి, ర
భ్రంబున సంజ తగ్గె, విరఁబాఱెఁ దమంబు క్రమంబుగాదెసల్. 7

తే. గీ. కొండలన్నియుఁ గాటుకకొండలయ్యెఁ
జెట్టులన్నియుఁ జీఁకటిచెట్టులయ్యెఁ
బండులన్నియు నేరెడు పండులయ్యె
నేమనఁగవచ్చుఁ దామసిదీమసంబు! 8

ఆ. వె. జలజజలజబంధుశరదాభ్రములయందుఁ
గలుగు రాగమెల్లఁ గలసి జార
జారిణీమనఃప్రచారంబు గావింపఁ
బోలు లేకయున్నఁ బోవుటెట్లు. 9

తే. గీ. గగన మను గని పెకలించి కాలపురుషుఁ
డందుఁగల వజ్రములఁ బయి నమరబెట్టు
చున్నపోలికఁ గ్రమముగా నొక్కటొకటి
గాఁబ్రకాశించెఁ దారక ల్గములుగట్టి. 10

చ. వెలవెలఁబాఱెఁ దూర్పుదెస వేవిళు లొప్పుసమీఁద గర్భిణీ
లలనమొగంబువోలె; శుభలక్షణలక్షితుఁడై దిగంగనా
తిలకముసొంపునన్దగి ప్రతిక్షణవర్ధిత కాంతిసంపదల్
చెలఁగఁగఁ జందురుండు వొడిచెన్ సగపాలుతమం బడంగఁగన్. 11

క. కలువలపాలిఁటి పున్నెము
కులుకుంజవరాండ్రపాలి కోరిక గజదొం

గలపాలిఁటి మృత్యువు వె
న్నెలరాయఁడు వెలిఁగె విరహిణీశత్రుండై. 12

క. కేరెఁ జకోరములెల్ల; వి
చారమ్మున మునిఁగెఁ జక్రిజంపతులు; జలం
బూరె న్నెలరాలన్; జే
కూతెన్ దంపతులకింపు; కొలఁకులుతేతెన్. 13

తే. గీ. పద్మినీకాంత తనుఁజూచి పవలు నవ్వ
రాత్రి నగసాఁగె దానిఁ గైరవిణి చెలఁగి;
యేరికేనియు నమవస యేగుమీఁద
రాణనెసఁగెడి పున్నమ రాకపోదు. 14

వ. ఇట్లు చంద్రుఁడు విజృంభించుటయు.

ఉ. "నారదుఁడేలవచ్చె? జననాయకు మోలికు, వచ్చుఁగాక తా
మారునిఁగన్న సుందరునిమాటల నెత్తఁగనేల? యెత్తుఁగా
కారమణీమనోహరునియందము నామది కెక్కనేల? "నా
కోరిక దీర్చువారెవరొకో? యిపు" డంచు మదిం దలంచుచున్. 15

మ. "అనురాగంబది కన్నుఁగానదు, మనంబా మిణ్ణుపల్లమ్ములన్
గనకెచ్చోటకునైన నేగు, నిఁక వేడ్కల్ మంచియున్ జెడ్డయున్
మునుపే నేరవు, మన్మథుండు చపలాత్ముండెంతయు న్మూర్ఖుఁ డం
గనలన్ లోకువఁజేసి మీఁదఁబడు శక్యంబే నివారింపఁగన్?" 16

క. అని పలుఁదెఱఁగుల మనమున
జననాయకపుత్రి ప్రబలసంశయడోలా
వినిహితమగు తనహితమున
కనుమతలగు చెలులులేమి నటుచూచుతఱిన్. 17

ఉ. నెచ్చెలులేగుదెంచి ధరణీవరపుత్రికఁగాంచి తద్విధం
బచ్చుపడంగనెంచి ప్రియమారఁగ డగ్గఱఁజేరి యెంతయున్
బొచ్చెములేనికూర్మి పొలుపున్ దెలుపన్ విరహాగ్ని పైపయిన్
హెచ్చఁగఁ బచ్చవింటిదొర హెచ్చులునున్ బయిపెచ్చులై తగన్, 18

క. పొదలుటకు సంశయించుచు
ముదితకుఁ దామిట్టులనిరి ముద్దియలు "బళీ
యిదియేమివింత! తాపా
స్పదమయ్యె లతాంగి మేను క్షణకాలమునన్. 19

చ. కుచములఁ దారహారములఁ గ్రొంబొగ రేఁగుటయేమి? చందనం
బు చిటులుటేమి? మేను తెలుపుం బలుపెక్కుటయేమి? యింతలో
విచికిలగంధి నీకుఁ గనువేఁదుఱుగల్గిన హేతువేమి? యిం
త చపలత౯ వెసం గను విధంబదియేమొ? యెఱుంగఁజెప్పుమా. 20

క. నీవైఖరిచూచిన నీ
భావం బల తుంటవింటివానికి నిల యీ
భావముగనె ననితోఁచెడిఁ
బైవారమె? యేము నీకుఁ బద్మదళాక్షీ. 21

క. కావున నీనెమ్మదిఁగల
యావత్సంగతులు చెప్పు మందుంగల కా
ర్యావసరము గనుఁగొందము
నీవారికిఁ దెలియకుండ నీరజనేత్రీ. 22

వ. అనిగ్రుచ్చి గ్రుచ్చియడుగు నెచ్చెలుల కచ్చెలిమిన్న గన్నన నిట్లనియె. 23

ఉ. చెప్పెడిదేమి నాకుఁగలచేవయుఁ దోవయు మీరకాదె? మీ
యొప్పనికార్యమందు మదినుంచెడిదాననె? మీకుఁజెప్పుటల్
తప్పునె? తప్పుగల్గునె? విధానమెఱింగిన ప్రోడలైన మీ
రెప్పని సేయఁజాల? రిది యెంతటికార్యము మీరుపూనినన్. 24

ఉ. నారదమౌని వచ్చి జననాయకుముందరఁ గృష్ణచర్య లిం
పార విపంచికారవము హాయిగఁగూర్చి వచించెఁ, జించె న
మ్మారుఁడు నామనంబు పలుమాఱు శరమ్ములనించినించి, యో
సారసగంధులార! యెకసక్కెము చేసెదరేమొ? నెమ్మదిన్. 25

చ. అవనివరుండు నమ్మునివరాగ్రణియాన స్వయంవరమ్ము సే
యవలయునంచు నెంచె నపుడామురవైరి యనుగ్రహించి యా

యవనికిరాకయున్న మన మావలఁజేసెడిదేమి? వానికొ
క్కవిషయమౌనె? నావలపుకాంతలు వేనకువేలు గల్గఁగన్. 26

సీ. ఎదుటొమ్మదిగక నెమ్మదికెక్కు పలుతక్కు
లొదవించు రుక్మిణీయువతి కన్నఁ
దొడఁజేరికడుమీటి గడిదేరి ప్రోడయై
ప్రేమచూపెడి సత్యభామకన్న,
నును కెంపు కనునింపులను జంపునుంకించి
భయపెట్టికలఁచు జాంబవతికన్నఁ,
జలమూని తలఁపాని వలపే నియతిఁజేని
లీలనోలార్చు కాళిందికన్న ;
తే. గీ. నెచటదొరకిన నచటన యిండ్లకడకు
లాగికొనిపోవు గొల్ల యిల్లాడ్రికన్నఁ
జక్కఁదనమున్న దానెనో, చాకచక్య
మున్నదాననొ ? యేను దామోదరునకు. 27

వ. అని పట్టరాని తమకమ్మున నెట్టకేలకు గుట్టుచెడి వెట్టగదుర నెట్టుకొని యిట్టు నట్టును దోఁపమిఁ దనలో,

సీ. అరుక్మిణీదేవి కథరంబమై తేని
యధరమా ! తదధరసుధలభించు
నాసత్యభామకు హస్తంబవై తేని
హస్తమా ! యతని కేలంటగల్గు
నాజాంబవతికి వక్షోజంబవేని వ
క్షోజమా ! తన్నఖాంకురము లొలయు
నాసుదంతకుఁ గన్నులై జనించితిరేనిఁ
గనులార ! యతనిఁ గన్గొనఁగనబ్బు ;
తే. గీ. తుదకు నొక గొల్లసుదతికిఁ బదములైతి
రేని చరణమ్ములార! యా తేనిమౌళి

షానన లభించు నారీతిమాని నన్నొ
నాశ్రయించితి రేమి భాగ్యమ్ము గల్గె? 29

ఉ. ఎంతటిసోయగంబొ? మఱియెంతటి చక్కని చాకచక్యమో?
యెంతటి వింతసంతసమొ? యెంతమనోహరతావిశేషమో
యెంతటి ఠీవియో? మఱియు నెంతకు నెంతయుఁగాక యున్న న
క్కాంతలు నన్యకాంతలును గంతుని మంతనమందు నుంతురే. 30

మ. మదనుం దిట్టఁగరాదుః కోయిలతో మారొడ్డఁగారాదు, నె
మ్మది వారింపఁగరాదు, కోర్కెలపసన్ మర్దింపఁగారాదు, దు
ర్మదముం గ్రిందుగఁజేయరాదు, తనకామం బన్యులౌవారితో
మొదలే చెప్పఁగరాదు కష్టముకదా, పూఁబోడియైపుట్టుటల్! 31

క. మదనా! నీకిది యెంతయు
వదనా? నీవంటివాని కనదలమీఁదన్
గదనార్భటి తగునా? యా
పదనాటిన వారిమీఁద బాహుబలంబా. 32

క. పౌలయలుకలుగల కలుకుల
కలఁక వెలికిగొలుపు తలఁపుగలిగింపఁగ నిన్
గలిగించెను జలజాసనుఁ
డిల వెలియగు జలజముఖుల నేచెదవకటా! 33

క. కలసిమెలసి చెలరేఁగెడి
తలునీతలునులకు వలపుతలఁపులుపైపై
నౌలయించినఁ గలుగును నీ
కిలఁ జలనము లేనికీర్తు లిక్షుశరాసా. 34

చ. భుజములు తీటవట్టినను బోరఁగరాదె, పురారితోడ? నీ
రజముఖులా? భవచ్ఛితశరమ్ములదాడికిఁ దాళువారు; నీ
విజయ మెఱుంగమే? యజుఁడు విష్ణుఁడు రుద్రుఁడు నీకు దాసులౌ
ర! జగము లెల్లగెల్చి యొకరామపయిం దగునా? ప్రతాపముల్. 35

శా. రాజీవంబ యటంచు వైచెదవు తదాశ్రీజీవమున్ జీవమా
రా జాగేల? యటంచు జీవమును గూర్చిరంబై వెలింజేయు నో
రాజీవాప్త! భవద్వినోదములు మార్జాలంపు సయ్యాటలై
రాజీవాక్షుల నేచుచున్న విది ధర్మంబౌనె? నీ కోఁటికిన్. 36

వ. అని చంద్రు నుద్దేశించి,

తే. గీ. తండ్రి జీవనదాత నీధామ మెన్న
జీవనదమార్గ మాకృతిశీవి జీవ
నస్వరూపమ్ము నీకు ననాథజీవ
నాపహరణంబు యుక్తమౌనా? శశాంక! 37

తే. గీ. పంకజములకు నీకును బద్ధవైర
మట్టి పంకజసాయకు ననుసరించి
చేవచూపెద వౌర! రాజీవవైరి
పరమ శత్రులు గలసినఁ బ్రతుకఁదరమె. 38

చ. సహజకళంకమంది గురుసామజయానను గూడి యామినీ
విహరణశీలివై దివి భువి న్నిలుపోపకయున్నయట్టి నీ
యహమిక కంగనామణులు నా నొక లెక్కయె? యింతయేల? నీ
యిహము పరమ్మనుం గనని యెడ్డెల నేమన నేమిలాభమౌ. 39

చ. ఎదుటికి వచ్చి పుష్పముల నింపుజనింపఁగఁ జల్లినట్టి య
మ్మదను మహోగ్రకోపమున మాపిన యాపురవైరి యెప్పుడున్
గదలక నెత్తికెక్కు నినుఁ గాదనఁ డాగ్రహమూనఁ డక్కటా
మది నొకలింగధారి వని మాటికిఁ దా నభిమాన మూనెనో. 40

క. అని చందురునిం బలుమఱు
గినిసి పలికి చెవులు చించు కీరమ్ముల మిం
చినగతిఁ గేరెడి పికములఁ
గనులెఱ్ఱఁగఁజేసి యనిలుఁ గని యిట్లనియెన్. 41

క. చలమానవేల? మలయా
చలమారుతమా! వియోగవలమానినులన్

బలమాఱఁజేయు టిదియొక
బలమా? కలమాట తెల్పు పథికులఫలమా. 42

ఉ. ఈగతి దూఱిదూఱి యొక యింతయుఁ దాళఁగలేక మూర్ఛవో
గాఁ గని నెచ్చెలుల్ చలువగందము గుబ్బలఁబూసి శీతలో
ద్యోగము లెన్నియేనియును దోఁచినవట్టు నొనర్చి తేర్చి యిం
కేగతి నిర్వహింతు మని యెంచి తలంచుచు నున్నయంతటన్. 43

తే. గీ. కెలనఁ బంజరముననున్న చిలుక వలికె
"నేల యీలీల యోజింప నేనుగల్గఁ?
గృష్ణునెఱుఁగనొ? ద్వారకకేగలేనొ?
కార్యమును బొత్తుపఱచెడి గతు లెఱుఁగనొ? 44

ఉ. మున్నొకనాఁడు చూచితిని ముచ్చటమీఱఁగ ద్వారకాపురం
బన్నగవైరిప్రోలు నగజాధిపువీడు రమేశురాజధా
ని న్నగఁజాలు నన్నగరి నిచ్చలుఁ గాఁపురమున్న భూసురుల్
జన్నములందుఁ బ్రోడలు విశాలయశుల్ నిగమాంతకోవిదుల్. 45

ఉ. వారల పాండితీమహిమ వారలయోగ్యత వారితీరు న
వ్వారి కులానువర్తనము వారలతేజము వారిసంపదల్
వారి కుటుంబవైఖరులు వారిపరోపకృతిస్వభావముల్
వారిజ సంభవుండయిన వర్ణనసేయఁగలేఁ డొకింతయున్. 46

క. అదియేమి వింతయో యొక
పదియేఁడులు వచ్చువఱకె పదమున్ గ్రమముఞ్
దుదముట్టఁ జెప్పనేర్తురు
చదువుల కిక్కలగు బ్రహ్మచారులు నగరిన్. 47

ఉ. కత్తులపైఁ బరీక్షనిడఁగాఁదగు వేదము, శాస్త్రమన్న మీ
చిత్తమువచ్చినంత యిఁకఁ జెప్పెడిదేమి, కవిత్వమన్న పే
రెత్తి జయింపశక్యమె మఱెవ్వరికేని, సమస్త విద్య ల
ప్పత్తనభూసురాగ్రిణుల పాలనరాదె? మఱింతయేటికిన్. 48

ఉ. రాజులకేమి ? సంపదల రాజిలు వారలులేరె ? తత్పురిన్
రాజులు నిర్జితప్రథితరాజులు రక్షితవేదశాస్త్రవి
దాళిజులు సమ్మదాయితవరాజులు సంపదలందు మేటి రా
రాజులు కీర్తినిర్మలితరాజులు రాజులు భోగసంపదన్. 49

తే. గీ. కోమటుల సంపదలను బేర్కొనఁగనేల
యాదియంతమ్మునొందియు నాదియంత
మును గనక మధ్యమమ్మలైచను ననేక
ములు మణులు వజ్రములు రత్నములును నెలమి. 50

తే. గీ. విష్ణుపదజులు సదసద్వివేక మెఱఁగి
తగు ననంతాప్తిచే మహోదయముగాంచి
విధుని సంసేవనముఁగల్గి విధివిహితగ
తుల నతులవైఖరుల నొప్పుదురు పురమున. 51

ఉ. అప్పురి వారకామినుల యందము చంద మటుండనిండు బల్
కుప్పలుగా ధనంబు పదికోటు లొసంగినఁగాని నీచునిన్
జెప్పలు విప్పిచూడరు సరేకద ! విద్యలుసూపి ద్రవ్యమున్
గొప్పగ సంగ్రహించి యనుకూలురఁగూడి సుఖింతురెంతయున్ 52

ఉ. అందమునందుఁ దన్నగరమందలి గొల్లవెలందులే మరు
చ్చందనగంధులం గెలువఁజాలుదు రన్న ధనాంగనామణీ
బృందము నెన్న నేల ? పురవీథులఁ బూవులనమ్మబోట్లతో
డం దులఁదూఁగ నేర్చునె బెడంగున రంభయు గింభయేనియున్. 53

ఉ. పూవులతోఁటలా, ముదముఁబుట్టఁగఁజేసెడి మేటితావులా,
బావుల తీవులా, మణులుపన్నిన మేల్మికడాని మేడలా,
మావులతావులా, మధురమంజులకోకిలకాకలీకల
ద్రావములా ! మనోహరము తత్పురమెన్నిఁట నెన్నిచూచినన్. 54

క. ఆపురము నేలికొనెడి మ
హాపురుషుఁడుకాఁడె ? కృష్ణుఁ డనఁగ, నతనితో

రూపమున నన్యవిధమున,
నేపురుషులు సాటివత్తు రే భువనమునన్. 55

సీ. పురిటింటనున్నయప్పుడ పూతననుగొట్టి
మేటివిఖ్యాతిచే మించినాఁడు
అతిబాల్యమైన ప్రాయమున మద్దులఁగూల్చి
యందరాని యశమ్ము నందినాఁడు
అంతకింతైన ప్రాయమ్ములోనన దావద
వము మ్రింగి ప్రశస్తి దవిలినాఁడు,
అంతకొక్కింత హెచ్చైన ప్రాయముననే
నగమెత్తి సత్కీర్తి నెగడినాఁడు
తే. గీ. కాళియాహిమదం బడగంగఁద్రొక్కెఁ
గంసు హింసించెఁ, దనవారి కష్ట ముడిపెఁ,
బెండ్లియాడెఁ, గుచేలుఁ గుబేరుఁజేసె,
నాతఁ డగుఁగాదె ? శ్రీకృష్ణుఁ డతివలార! 56

క. పదియాఱువేల చెలులకు
మదనుండై వెన్న పెరుఁగు మఱపించి ముదం
బొదవఁగఁ దిని బలిసిన కో
విదమాన్యుఁ డతండు గుఱుతు వేఱెఁకనేలా. 57

ఉ. ఆతని చిత్రమేమొ యొకఁడయ్యును నందఱ కన్ని రూపులై
వ్రేతల సొక్కఁజేయుచును వేయివిధమ్ముల మెప్పులందె త
చ్చేతములందు నెప్పుడు వసించు నటంచును జెప్పవింటి మా
జ్ఞాతులఁజూడఁబోయి యొకనాఁడు నిజమ్ముగ నమ్మఁడింతయున్."

చ. అను శుకరాజుమాటలు హృదబ్జము బిట్టలరింప నెచ్చెలుల్
విని గదియంగఁజేరి పృథివీవరు పుత్రికఁగాంచి "నీమన
మ్మునఁ గల కోర్కె లింపలరఁ బూర్తియొనర్పఁగఁ బూనినట్టి నీ
యనుఁగు శుకమ్ముమాట వినవమ్మ! మనఃపరితాప మాఱఁగన్. 58

చ. పులుఁగుల కిట్టికార్యములు పూనఁగఁజెల్లదటంచు నెంచఁగా
నలవశ దల్లనాఁడు దమయంతికి నన్నలుతోడ నేస్తముం
గలుపదె యొక్కయంచ? గనఁగా నివి కొ్రత్తలె? తత్తదున్నత
స్థలముల కేగఁజెల్లునె? వెసన్ మఱియొక్కరి కెంతవారికిన్. 60

శా. ద్వారమ్ముల్ పనిలేదు కోటలనిన్ దాఁటుల్ తదంతస్థ్సితా
గారంబుల్ సొర శంకలేదు పులుఁగుల్ గా కిట్టికార్యమ్ము లె
వ్వారల్ దీర్పఁగలారు? నీ మనమునన్ బాటిల్లు తాపమ్ము నీ
కీరాగ్రేసరుతోడఁ జెప్పఁదగదే? కీరేశ్వరాలాపినీ. 61

ఉ. అమ్మరో! యిట్టికార్యముల యం దిటు జాగొనరింపరాదు వే
గమ్ముగ నీమనోరథము గాదిలిచిల్కకుఁ జెప్పిపంపు జా
లమ్మొనరింపఁబోకుము విలంబము చెట్టయగున్ "శుభస్యశీ
ఘ్ర" మ్మని చెప్పినట్ల వినవుగా, తడవాయె నిశీథమేగెడిన్." 62

క. అని మాటిమాటికిని బో
ధనచేసెడి చెలుల విసువు దనరఁగఁ గని నె
క్కొని మఱియు మఱియు బోధిం
చిన మెల్లనఁ జిల్కతోడఁ జెలి యిట్లనియెన్. 63

క. రమ్మనుమీ, నైపుట భా
రమ్మనుమీ, విరహ మతిభరమ్మనుమీ, వా
రమ్మనుమీ వ్యవధి, సుదూ
రమ్మనుమీపురి, స్వయంవర మ్మనుమి తగన్. 64

క. చలమనుమీ మరునకు. ని
శ్చలమనుమీ మన్మనం, బచలమనుమి దృగం
చల మన్యులపై. నిదిచం
చలమానిని గాదటంచు శౌరికిఁ జెపుమీ. 65

క. మొ్రక్కితిననుమీ, తనకుం
దక్కితిననుమీ. విశేషతాపభరమునన్

సొక్కితిననుమీ మిగులన్
జిక్కితినను మీ, స్వయముగఁ జెప్పితి ననుమీ. 66

క. అనుమానమేల ? నిక్కము
నిను మాన నటంచుఁ బలికె నెలఁతుక పేర్మిన్
జనుమాన మొసఁగుమనుమా
చనుమా కనుమా కృపానుసారిన్ శౌరిన్. 67

క. విరు లరులు, సరులు నురులు, హి
మరుచియు నకరిమరుచి, పికమాద్యద్భృంగ
స్వర ముఱు భీకరతర, మే
మఱ కిదియంతయును దెల్పుమా నరహరికిన్. 68

చ. అనియనుపన్ శుకంబరిగె; నంచితసంచితపుణ్యగణ్యస
జ్జనధననందనందనలసత్పదపద్మరజోనుషంగస
ద్మనిభృతవాసభాసురమదప్రమదామృదుగానదూనదే
వనిచయమై తనర్చు నల ద్వారకకున్ గకుబంతచారియై. 69

తే. గీ. కుక్కుటములంతఁ గొక్కురుకోయటనియె
దిక్కులం దించుకించుక తెల్విదోఁచెఁ
జుక్కవొడిచెఁ బొటుక్కునఁ జూడఁజూడ
దీపములు తెల్లవారె సంతాపమాఱె. 70

శా. చోరుల్ దాఁటిరి తారకల్ జుణిఁగె గచ్చున్విచ్చుఁగా జారిణీ
జారుల్ వాఁటిరి మారుఁడున్ మరలెఁ గాసారంపుఁ దీరమ్ములం
బాఱుల్ సేరిరి దూరమేగు పథికుల్ మార్గంబులంబట్టి రం
భోరుట్సారవపూరపూరితములై పొల్పారె నుందెమ్మెరల్. 71

సీ. అభిసారికాంగనావ్యభిచారములుతగ్గెఁ
దమము తూరుపు పర్వతమ్ము డిగ్గెఁ
గువలయమ్ములరంగు దవుదవ్వుల మణింగె
వెఢవింటివాని యాగడమడంగెఁ

బదిమ్రనీకాంతకుఁ బ్రాయంబునిండారె
నంబుజారికి వై భవంబుతీఱె
నేకీభవించుచుఁ గోకముల్ చెలరేఁగె
గుడ్లగూబలు కొండగుహలడాఁగె
తే. గీ. రంగుమెయి మత్తువస్తువుల్ మిర్రింగిమిర్రింగి
యొడలెఱుంగని రతముల బడలిబడలి
తెలివిఁగనలేని బలుసోమరులకుఁ దక్కఁ
దెల్లముగ నెల్లవారికిఁ దెల్లవారె. 72

ఉ. రంగుగఁ దూర్పుకొండపయి రాజిలు చెట్టునబుట్టినట్టి నా
రంగఫలంబనంగఁ గడురమ్యములౌ నరుణప్రభాచ్ఛటల్
నింగినిఁ బర్వఁ బంకజవనీకమనీయత మాటిమాటి కు
ప్పొంగ సహస్కరుండు పొడుపుంగనెఁ జక్కవ లొక్కపైతగన్. 73

తే. గీ. ప్రాఙ్నగము సూర్యుఁడనుపుత్రుఁ బడయుకతన
సంతసమ్మున దిక్కుల కంత రక్త
రాంకవమ్ములు బహుమతి రాణనొసఁగె
నాఁగ నీరెండ చెన్నారె నాల్గుదెసల. 74

ఉ. అంతకు లక్షణాసతియు నాబిడ నెచ్చెలులున్ దిగంతర
ప్రాంతనివిష్టదృష్టులయి పల్కఁఖ కీరము రాక చూచుచున్
గంతు దురంతతాపమునఁ గ్రాఁగెడి రాతనయన్ బ్రమోదిత
స్వాంతనొనర్ప నేగిరి వసంతునికోటకుఁ బూలతోఁటకున్. 75

సీ. గొలలచేఁదూఁగు కదళికల్ ఫలమ్ములఁ
గొమరారు నారికేళములగములు
చేయెత్తు నిడుపువచ్చెడి పూగములు కిసా
లయములఁ దగురసాలంపుఁ దరులు
పూలఁ బిందెలఁబండ్ల వ్రాలెడి పనసలు
పండినచెఱకులఁ బ్రబలుమడులు

నడుగడ్డునకును జొప్పడు పిల్లకాల్వలు
కంటికి నింపగుపంటచేలు
తే. గీ. చక్కని కొలంకులును మేటి చంద్రికాంత
ఫలకవేదులు కేళకూళులు సుమాళ
మలరు కేళీగృహమ్ములు పొలుపుదెలుపు
వలపుజిలికెడి యుద్యానవనమునందు. 76

సీ. ఉభయపార్శ్వములందు నొప్పారు మల్లికా
ప్రతతి సౌందర్యంబు పాఱఁజూచి
దూరదూరమ్ముగాఁ గేరుకోయిలలతోఁ
దులదూఁగు మావుల నరసియరసి
జలజలరాలు పుష్పములకుప్పల సౌర
భమువొల్చు పొగడవృక్షములు గాంచి
మలయవాయువులచేఁ గలయఁబర్వెడి పరా
గముల నొప్పెడి నికుంజములనెంచి
తే. గీ. తమ్మిపూఁదేనెఁగ్రోలి చిత్తమ్మునకు ము
దమ్మునం దిమ్మనుం గ్రిమ్మ తుమ్మెదల ర
రవమ్ములకు నిమ్మయిన తటాకమ్ముపొంత
వింతయగు చంద్రకాంతశిలాంతరమున. 77

శా. కాలక్షేపముకోసమై సొగసులౌ కంసారి సంసారపున్
హేలల్ వాడుచు లక్షణాంగనకు నెంతే మోదముం గూర్చుచున్
వేళాకోళములాడుచున్ నృపసుతన్ వేమాఱు నూరించుచున్
హాళిన్ దేల్చుచుఁ గూరుచుండిరి వయస్యల్ కీరముం దూరుచున్ 78

ఉ. అంతట నేగుదెంచె రయమారఁగఁ గీరము దూరమౌ పరి
శ్రాంతి నొకింతయున్ గణనసల్పక, వచ్చెడిదాని నంబర
ప్రాంతమునందుఁజూచి ముదమందుచు "నీకొకవందనమేండ్లు, మా
వంత లడంగె మాకుఁ బదివందలమేం" డ్లని రందఱుక్ జెలుల్. 79

క. అనునంతట నక్కీరము
వనజేక్షణ కేల వ్రాలి వగరుచుచున్ గృ
ష్ణునిఁ జూచితిఁ జెప్పితి వ
చ్చునతండు స్వయంవరమ్ము చూచెడి వేడ్కన్. 80

వ. అని సంక్షేపమ్ముగా ఫలితార్థమ్ము చెప్పిన నచ్చిలుకలకొలికి యచ్చిలుకం
గని మెల్లన నిమురుచు నిట్లనియె. 81

ఉ. ఏమనె శౌరి ? నీవు మఱి యేగతి నేగితి ? వేడనుండె నా
రాముని సోదరుం, డెటు విరామముగల్గెఁ బదాఱువేల గో
పీమణులన్ భరించు నల వేణువినోదికిఁ? బూసగ్రుచ్చిన
ట్లీమెయి సర్వముం దెలుపుమీ, శుకరాజకులావతంసమా ! 82

ఉ. రమ్మని గారవించెనొ, కరమ్మున నీవయి పోయివ్రాలితో?
కమ్మ లిఖించి యిచ్చెనొ ? ముఖాముఖి మాటలు సెప్పి పంపెనో ?
నమ్మెనొ, నమ్మలేదొ ? మఱి నా వలపంతయు మూలముట్టుగా
నమ్మధుసూదనుండు నిజమంచుఁ దలంచెనె ? కూర్మినించెనే. 83

ఉ. పోతి నిశీథమందపుడు బోటులకూటములందు నమ్మురా
రాతి విలాససౌధముల రంజిలు నాసమయమ్మునందు నీ
కాతని దర్శనంబెటుల నబ్బెనొ ? యేగతి విన్నవించితో ?
చేతము చల్లనౌనటులఁ జెప్పఁగరాదె సవిస్తరమ్ముగన్. 84

చ. కువలయనేత్రి సారెకును గోరిక లీరికలెత్త నీగతిం
దవిలి పునఃపునఃప్రకలితమ్మగు నాదరముం దురమ్ముగా
నవిరళమై రసప్రసరమై తగు వాక్యపరంపరన్ గడుం
జవిదళుకొత్తఁ బల్కినవెసన్ శుకరాజవతంస మిట్లనున్. 85

క. ఏ నరుగువఱకుఁ గారణ
మేనెఱుఁగనుగాని యాతఁ డెఱిఁగినయటులన్
దానొకఁడు నొక్కఁడై యో
మానిని ! సౌధాగ్రిమందు మసలుచునుండెన్. 86

చ. ఎలమిఁ బిచారుసేయు జలజేక్షణు దవ్వులఁగాంచి కార్యముల్
ఫలితమగుంగదా యనుచుఁ బక్షములన్ ధ్వనిరేఁగకుండ ని
శ్చలగతి నాతఁడున్న మణిసౌధము పొంతకునేగి తద్గవా
క్షలనడుమన్ దృగంచలముసాచి గృహాంతరమెల్లఁ జూచితిన్. 87

చ. చిలుకలుకొన్ని పంజరవిశేషములన్ గనుపట్టె; నంత లో
పలికి వెసన్ జనంగ నొక పద్మదళాక్షియు లేకపోయె; నా
తలఁపున సందియంబగుఁగదా, యపుడేమి యొనర్పఁగావలెన్?
జలజదళాక్షిఁడైన నొక చందనగంధియు లేకపోవునే! 88

వ. ఇట్లు సంశయించి వెండియు. 89

సీ. కారుకమ్ములనేలఁగాఁజాలె నెమ్మేను
నెమలిపించియము పెన్నెఱులనొప్పెఁ
గరముల శంఖచక్రములు పేర్మినెసంగె
వనమాల గళమున నెనసిగ్రేలెఁ
గౌస్తుభం బక్కుపైఁ గళల నీనఁగసాగె
శ్రీవత్సమును వింతచెలువు తెలిపెఁ
బీతాంబరంబు విస్ఫీతమై కనుపట్టె
వేణువామోవిపై రాణనలరె

తే. గీ. తక్కుఁగల గొల్లదొరల బల్ చెక్కులెల్ల
చక్కనగుఫక్కిఁ గన్పట్టె నిక్కమితఁడు
కృష్ణుఁడేయని యోజించి కెలననుండి
యెదుటవ్రాలితి నాతఁడు నదిరిచూడ. 90

చ. వెలఁదిరో! యేమిచెప్పనగు వెన్నునివింతలు, నన్నుఁజూచి "యో
చిలుక! భవత్సఖీమణికి సేమమె? పెండిలి యౌనచెప్పు? ద
య్యలికులవేణి కేన్నృపునియం దనురాగముగల్గె? నీకునుం
దెలియకపోదు నాకుఁ దగఁదెల్పుము పెండిలి కేనువచ్చెదన్." 91

చ. అని వదనమ్మునన్ బలుచనై నును లేనగవంకురింప నన్
గని యెకసక్కెపుంగతినిఁ గంజవిలోచనుఁడాడె నాతఁ దే

యనువున నీమనోరథమునారసె దయ్యమెఱుంగు ! నాకుఁదో
చెనపుడు నారదుండరిగి చెప్పెనటంచుఁ గురంగలోచనా. 92

చ. అదియనుగాదు నిక్క, మతఁడాతనితో నినుఁ జెప్పఁగాక, నీ
మదిఁగలమర్మమెట్లతని మానసమంటె ! నటుండనిమ్ము; నా
కిది కడుఁబెద్దవింత ! నను నీవనుపం జనినట్టిదానిఁగా
నెదనెటు నిశ్చయించె ? జగదీశ్వరుఁ డాతఁడెఱుంగకుండునే. 93

వ. అంత నేనును మహానుభావుండగు నతనికి నమస్కరించి వినయమ్మున
నిట్లంటి. 94

క. దేవా ! నీవెఱుఁగనికత
లేవీటన్ గలుగు ? నీకు నేనెఱిఁగింపం
గావలయునె ? పునరుక్తము
గావలయునె ? యంచుఁ జెప్పఁగా దొరఁకొంటిన్. 95

తే. గీ. భూసరోజముఖీమణిభూషణంబు
సప్తభూమికహాటకసౌధవరము
సకలసంపద్విభాసురజనచయంబు
మదర్రిములకెల్ల తనరారు మదర్రిపురము. 96

క. పాఱులు ధృతనిగమవ్యా
పారులు సమధీతనిగమపారులు జితకో
పారులు సమస్తశాస్త్రి
పారు లుదారులు నజాతపారులు నగరిన్. 97

ఉ. అచ్చటి రాచవారు కలనైనను బోరులనోరగారు, వి
వ్వచ్చునినైన మెచ్చ, రల భార్గవరాముఁడు నేఁడునున్నఁ బై
పెచ్చునిపించుకొందుమని బీరము బేరములాడుచుంద్రు; కాల్
గుర్రిచ్చినఁ బాఁపరాతలలకున్ దలవంపులొనర్తు రెంతయున్. 98

ఉ. తాతలనాఁటి పాతులకతమ్మున నాతని కందలేముగా
కొతఁడు మమ్ముఁబోలె ధనమార్జనచేసెనెయంచు నూరుసం

జాతపుజాతివారచట జక్కులరాయని లెక్కసేయ రే
పాతులులేకయే ధన మపారముగా గడియించి మించుటన్. 99

క. పాదజులెల్లరు ద్విజసే
వాదరు లత్యంతవిభవు లప్పురియం దా
మోదింపఁ దగనివస్తువు
లేదొక్కటియేనియును నళీకంబేలా. 100

వ. అట్టిపురమ్మున కధీశ్వరుండు 101

క. కలఁడు బృహత్సేనధరా
తలనాథుం, డతఁడు మిగుల ధర్మాత్ముండా
లలితునకు నొక్కకూఁతురు
వెలఁగున్ లక్షణయటంచుఁ జెప్పుదు రాపెన్. 102

ఉ. మాచెలియంచుఁ జెప్పికొనుమాటలుగావివి యామెఁబోల నా
మాచెలి యయ్యుమాసతియు మారునినారియు మాఱుగారు దే
వా! చెలులుందురౌఁగద పదాఱుసహస్రము లిప్పురమ్మునం
దాచెలియందమందలి పదాఱవతీరున మాఱనేర్తురే! 103

వ. అని వెండియు. 104

సీ. నీలంపుమణులు మానెలఁత పెన్నెఱులంటి
పడఁతిగుబ్బలు దబ్బపండులంటి
దానిమ్మగింజలు తరుణిదంతములంటి
మగువ కెమ్మోవి బింబఫలమంటి
చెలిమిన్ననూఁగారు చీమలబారంటేఁ
గలికివళుల్ తరంగమ్ములంటి
వనజాస్యనాసిక కనకపుష్పంబంటి
వెలఁదికన్నులు పద్మదళములంటి.

తే. గీ. సకియ నెమ్మోము పూర్ణిమాచంద్రుఁడంటి
కొమ్మ పెందొడ లంటికంబమ్ములంటి

నడుము సున్నంటిఁ బొక్కిలి సుడియటంటిఁ
దగును నీకంటి రమ్మని తగులుకొంటి. 105

క. కరములు నీరజశోభా
కరములు గళమెన్నదరనిగళమగు నఖరాం
కురములు హిమకరరేఖాం
కురములు పదములును విజితకోకనదమ్ముల్. 106

ఉ. బంగరుబొమ్మ సంపఁగులపట్టు చొకాటపుటిక్క మేలు మేల్
రంగులకుప్ప మారునిశరంబు రసంబులతేట వజ్రపున్
ముంగర నేరుపుందళుకు ముద్దులమూట వరాలపేట మా
యంగన, దానిఁబోలఁగల యంగన లేదని నొక్కి చెప్పితిన్. 107

ఉ. నారదమౌనివచ్చి జననాయకునొద్ద నొకింతగా భవ
చ్చారుతరప్రభావముల చందమునందమునుందగన్ మనం
బూరఁగఁజేయుచుం దెలిపె నోయదునందన! తత్క్షణంబ నీ
పై రుచివెట్టె మాచెలియ, పట్టఁగ శక్యముగాదదేరికిన్. 108

క. అళులనిన నులికిపడు నె
చ్చెలులన్నన్ గసరుఁ బికవిశేషధ్వనికిన్
దలఁకు శశియన్న నులుకున్
జిలుకలకొలికి యళు కేమి చెప్పఁగవచ్చున్? 109

చ. నిను నుతియించు నిన్ గసరు నీవనినన్ దలయెత్తిచూచుఁ దా
నినుఁ బలుమారునుం దలఁచు నీదు కథాసుధఁ గ్రోలు నంతట
న్నినుఁగను నిన్ను మ్రొక్కు మఱినిన్ను వినున్ నినుఁబాడు మాటికి
న్నినుఁబలవించు నిన్వెదకు నీమయమంతయు మాలతాంగికిన్. 110

ఉ. చక్కనివాఁడవీవు నెఱజాణలజాణ నరేంద్రకన్య; బల్
టక్కరివీవు సొంపగుబెడంగున మేటి నృపాలబాల; నీ
వక్కమలాస్యకుం దగుదు వక్కమలాస్యయు నీకుఁజాలుఁ; దా
మ్రొక్కె నుతించె వేఁడికొనె ముంచినఁ దేల్చిన నీవసుమ్మిఁకన్. 111

క. అని నీచెప్పిన సంగతు
లను శతగుణముగ నొనర్చి లలితగతుల బో
ధనచేసి "వత్తునిట" కని
యనిపించితి హస్తమందు హస్తంబిడియెన్. 112

చ. అని చిలుకాడుమాటలు హృదబ్జము బిట్టలరింప లక్షణా
వనజముఖీలలామ ముఖవారిజ మంకురితస్మితమ్ముగాఁ
జనవునఁ జిల్క కుక్కుటలు చక్కుటలుం దినిపించె; నార్తకా
మినులకు దూతలౌక్కతటి మేటివరమ్ములొసంగు దైవముల్. 113

తే. గీ. అంతనెచ్చెలు లిట్లని రానరేంద్ర
పుత్రితో "నీదు కార్యమ్ము పొత్తుపఱచి
నట్టి చిల్కకు సమ్మాన మాచరించి
చిల్క తేజీదొరను వెలిఁజేయనగునె''. 114

మ. అనఁ జూచాయల నత్తలోదరియుఁ దానంగీకృతిం దెల్పె న
వ్వనజాస్యల్ నృపపుత్రితో సరసిలో వాలాయమోలాడి యొ
డ్డునకున్ వచ్చి కురుల్ విదిర్చికొని పట్టుంబుట్టముల్ గట్టి నె
క్కొని భూషల్ ధరియించి బొట్టులిడి కోర్కుల్ మిన్నుముట్టన్ దగన్.

సీ. కిలకిలమనుచుఁ గోకిలలు గూసెడిచోట
నళిదంపతులగాన మమరుచోటఁ
జిలుకము త్తైదువుల్ గలసి యాడెడిచోటఁ
గేకులు పురివిచ్చి కెరలుచోట
నల్లిబిల్లిగ లతలల్లి యొప్పెడిచోటఁ
బుష్పపరాగంబు వాలయుచోటఁ
బిల్లవాయువులు సంప్రీతిఁ జేసెడిచోట
శారికల్ సురతముల్ సలుపుచోటఁ

తే. గీ. బూలఁబిందెలఁ దులఁదూఁగి నేలకంటు
గుజ్జులేనునుమామిడి గులుకుచోట

సపరివారమ్ముగాఁ బుష్పశరుని నిలిపి
యతని వామాంకమున రతి ననువుపఱచి. 116

క. ఆవాహనాదివిధుల ము
దావహముగ మదనదేవునర్చించి సఖుల్
పూవుందోయిలి గొని యా
దేవుని మదినిల్పికొని నుతించిరి భక్తిన్. 117

సీ. మదనాయ తారుణ్యసదనాయ శుభాంశు
వదనాయ దేవ తుభ్యంనమోస్తు
మారాయ వైరాగ్యచోరాయ భృతకీర
వారాయ దేవ తుభ్యంనమోస్తు
కామాయ సహచరసోమాయ విరహిణీ
వామాయ దేవ తుభ్యంనమోస్తు
తరుణాయ సౌందర్యవరణాయ శంబర
హరణాయ దేవ తుభ్యంనమోస్తు

తే. గీ. పంకరుహసాయకాయ తుభ్యం నమోస్తు
పద్మజాదినుతాయ తుభ్యం నమోస్తు
పరమపుణ్యకథాయ తుభ్యం నమోస్తు
భార్గవీనందనాయ తుభ్యం నమోస్తు. 118

చ. నలు దమయంతితోఁ గలిపినావు సుదర్శనుతోడఁ బేర్మి లీ
లలువొలయంగ నాశశికలాలలితాంగినిఁ గూర్చినావు నీ
విలఁగల యెల్లదంపతుల కేలికవై జగదాదిహేతువై
చెలఁగెడివాఁడ వీసతికి శ్రీహరి పొందొడఁగూర్పఁజాలవే. 119

చ. అని నుతియించి యావనితలందఱుఁ గందళితాంతరంగలై
యనుఁగు సఖీమణిం గలసి యంతిపురమ్మున నాపె డించి యా
జ్ఞనుగొని యిండ్లకేగిరి వెసన్; జలజాప్తుఁడు నంతఁ దీక్షవ
ర్తనుఁడయి మధ్యమాంబరపదమ్మున డంబుగనొప్పె నివ్వలున్. 120

తే. గీ. అవనిపతి భోజనాదికృత్యములు దీర్చి
కవులు మంత్రులు పండితుల్ గలసికొలువఁ
దరుణశరదిందుముఖులు చామరలువీవ
నిండుకొలువుండెఁ గన్నులపండువలర. 121

ఉ. నారదుఁడాడినట్టి వచనమ్ములు మంత్రులతోడఁజెప్పి మే
లారసి పుత్రికామణికి నాయదునందనుపై విరాళియున్
బాలుపెఱింగి చారులను బంచెఁ దగన్ శుభలేఖ లిచ్చి వి
స్తారధరాతలేశ్వరుల సంఘములన్ బిలువంగ నర్తిఁగన్. 122

— ఆశ్వాసాంత పద్యములు —

క. శ్రీశారదాకటాక్ష
వేశ సమావేశ సంప్రవృద్ధఖ్యాతీ!
దేశాయిదేశముఖము
ఖ్యాశాశ్రితబిరుదశాలి! యాప్తగుణాళీ! 123

చ. హితమితభాషితాపరిచితీతరహృద్గతభావవేత్తృతే
ప్సితసఫలీకృతిప్రతినివేశితగౌరవబుద్ధినిష్కళం
కితచరితా! కవిత్వరసకేవలతత్పర! సత్పరాయణా!
అతిపరిపక్వచిత్త! పరమాద్భుతవృత్త! మహాగుణోత్తరా! 124

స్రగ్విణి. తాటికొండాఖ్యసద్గ్రామధామా! నిరా
ఘాటసామర్థ్యయుక్తా! మహాశాంత! యు
త్పాటితక్రోధ! సంప్రాప్తబోధా! యశ
స్ఫాటవీచ్ఛేదనాయత్తచిత్తాంచితా! 125

— గద్య —

ఇది శ్రీతిరుపతివేంకటీయ లక్షణా పరిణయంబను
మహాప్రబంధమ్మునందు ద్వితీయాశ్వాసము

శ్రీరస్తు.

శ్రీమత్పరదేవతాయైనమః

లక్షణాపరిణయము

తృతీయాశ్వాసము

క. శ్రీరామచంద్రపదప
ద్మారాధననియతహృదయ ! హారహారయశ
శ్శ్రీరుచిర ! నిరుపమదయా
ర్ద్రా ! రక్షితపండితేంద్ర ! రామనరేంద్రా ! 1

తే. గీ. అవధరింపు మనంతరం బట్లు నంద
నందనుఁడు చిల్కఁ జెప్పిన యందచంద
ములు మనమ్మున నాటి యమ్ముద్దుగుమ్మ
కన్నులకుఁ గట్టినట్లుగాఁ గళవళించు. 2

ఉ. అంతకుమున్న విన్న చెలు వగ్గలమై తలకెక్కఁ రుక్మిణీ
కాంతున కంతకంతకును గంతునిదంతి వచించినట్టి య
య్యింతి విలాసముల్ మరుని కేవుఘటించి తదన్యకాంతలం
దెంతయు సేవగింపు లగియింపఁగఁజేసె నదేమివింతయో. 3

సీ. రుక్మిణితోఁ బొత్తు రుచియింపదాయెఁగాఁ
దాయగాఁదోఁచె సుదంతవింత
సాత్రాజితి యటన్న శత్రుత్వమాయెఁగా
మాయగాఁదోఁచె జాంబవతిపేర్మి
రాధికాసతి చెల్మి రహిలేకపోయెఁగా
పాయఁగాఁదోఁచె నాథదర్పేర్మి
నీలపొం దడవివెన్నెల పోలికాయెఁగా
కాయగాఁదోఁచె నర్కసుతమమత

తే. గీ. వన్నెగల గొల్లకన్నెల చిన్నెలన్ని
యెన్నికకు రాక మునుమున్న వన్నెదఱఁగె
చిన్ని చిన్నారి చిన్నెలు వెన్నుదన్న
లక్షణామయుఁడయ్యెఁ బద్మేక్షణుండు. 4

సీ. సందియంబందె భీష్మకరాజనందన
సత్యభామ కొకింత శంకవొడమె
రాధకు మునువోలె రసమెసంగకపోయె
భద్రికు నీరసభావ మొదవె
కళలుజారుట తప్పెఁ గాళింది కెంతయు
ననుమానము సుదంత కినుమడించె
జాంబవతికిఁ బూర్వసారస్య మెరుసాయె
నీలకు మునుపటిబాళి తఱఁగె

తే. గీ. లక్షణాధీనుఁడైన పద్మాక్షుపొందు
సుందరులకందఱకుఁ గ్రొత్తచందమాయెఁ;
గాంతులమనమ్ము లన్యసంగతములైనఁ
దెలివిగల ప్రౌఢచెలులకుఁ దెలియఁబడవె? 5

చ. తమకుఁ బరస్పరమ్ముగల తామసముల్ విడనాడి యందఱుఁ
గుమిగొని కృష్ణుచర్యలను గొంతవడిన్ దలపోసి యంత న
క్కమలదళాక్షు చిత్తమధికమ్ముగ లక్షణయందుఁ జిక్కుటల్
క్రమముగఁ గింపదంతిగఁ దగన్ దెలియంగఁ దలోదరీమణుల్. 6

క. "మన మనుభవింపఁగా మిగి
లిన సౌఖ్యం బనుభవించులే" యంచు నొక
ర్తను; "దానికేమి యదియును
మనవంటిదె పో" మ్మటంచు మఱియొకతె యనున్. 7

ఉ. "చాలమటంచు నింక నొక సారసగంధిని గూడనెంచెనో!
యాలలితాంగి యందమున కందఱు కెక్కుడటంచుఁ దోఁచెనో!

స్త్రీలు పదాఱువేలుగల చెల్వునకేమని యాసచేసెనో
యాలలనాశిరోమణి, బళా! కలరే; మనవంటి వెఱ్ఱులున్! 8

క. తరుణి కొాక పురుషునందుం
దిరముగ మదినిల్పుఁగాని తెఱపలయందున్
దఱచుగఁ బురుషుల కొాకచో
గుఱినిల్పుట కాన మేమొకో? తరళాక్షీ. 9

క. మనచంద మెచ్చటను మే
దినిఁ గనవినరాదు వింతతెరువిది లోక
మ్మునఁ బురుషులిట్టివారలు
వినఁబడిరె? పురాణములను వేదములందున్. 10

చ. ఇతరమృగాక్షులందుఁ గలనేని మదింజొారనీక సంతతం
బతివయొకర్తుగా నియమమందెడి సుందరులైన పూరుషుల్
వెతకిన నెందునేనిఁ బృథివిం గలరేమొకొా యంచు సంశయా
హతమగు నామనం, బటులనబ్బిన గుబ్బెతపుణ్య మన్యమే." 11

క. అని పలువిధములఁ గృష్ణుని
వనజాననలెల్ల వారివారిమదికిఁ దోఁ
చినభంగి నాడికొని; రం
గన లన్యస్వాంతుఁ గాంతుఁ గని యోరుతురే. 12

సీ. చిలుకపోయినతోవ్రి పలుమాఱుఁ దిలకించుఁ
దిలకించి నిట్టూర్పు వెలికివిడుచు,
విడిచి యించుకసేపు తడబాటు మదిఁదాల్చుఁ
దాల్చి కందమ్ము లంతలుగఁజేయుఁ,
జేసి లోలోన విశ్వాసమ్ముసంధించు
సంధించి యచ్చాన చందమెంచు,
నెంచి ముచ్చటలాడ నించుకగమకించు
గమకించి తనలోనఁ గళవళించుఁ,

తే. గీ. గళవళించి యపత్రపగాంచి మించు;
మించి యోజించు; యోజించి మేలుగాంచుఁ
గాంచి చింతించు; చింతించి కంతునెంచు;
నెంచి "దయయుంచు" మని పలవించు శౌరి. 13

సీ. తా బృహత్సేనుఁడై తనరువాఁడయ్యు బృ
హత్సేనసుతకునై యాసచేయుఁ,
దా బహులక్షణాధారుఁడయ్యును నొక్క
లక్షణాతరుణీవిలాసమెంచుఁ,
దా బయోధరపయోధరహారియయ్యు న
త్తలునిపయోధరమ్ములకుఁ దలకుఁ,
దా దావఘోరాగ్నిఁ ద్రావువాఁడయ్యు న
య్యంగనావిరహాగ్నికటమటించుఁ,

తే. గీ. దా ననంగునిఁ గన్నట్టి తండ్రియయ్యు
నయ్యనంగుని శిక్షింప నడరుగాంచుఁ
దా జగన్మోహనుండయ్యుఁ దద్గతైక
మోహినీ మోహవార్నిధి మునిఁగితేలు. 14

క. ఈగతిఁ గృష్ణుండెంతయు
వేఁగుచు నుద్యానమునకు వెడలి యచట నా
నాగమపీక్షకలనో
ద్యోగమ్మునఁ బ్రొద్దుపుచ్చుచుండెఁ దనంతన్. 15

ఉ. అంతట నేగుదెంచిరి స్వయంవరలేఖలు గొంచుఁ జారు ల
క్కాంతునిఁ గన్నతండ్రి కెసకమ్మున విన్నపమాచరింపఁ, గం
సాంతకుఁ డాదరమ్మున స్వయంవర లేఖ పఠించి లోన నా
క్కాంత దిటమ్ముపూని చనియెఁ దనమేడకు నిశ్చితాత్ముఁడై. 16

తే. గీ. లక్షణాచంద్రముఖియు విలక్షణార్తి
నలసిసొలసి "స్వయంవరమగుట యెప్డు,

కృష్ణసందర్శనంబగు టెప్డు, నా మ
నోవ్యథలు తీఱుటెప్పు'' డనుచుఁ గడంగి. 17

ఉ. ద్వారకయున్న దిక్కునకుఁ దద్దయు దృష్టినిగుడ్చుచున్ సఖీ
వారము తత్పురీపథమువంకకు నంపుచు మాటిమాటికిన్
మారుని దూఱుచున్ మలయమందసమీరకుమారుఁ గేరుచున్
వారిజనాభునిన్ హృదయవారిజమందుఁ బసందు చేయుచున్. 18

తే. గీ. అవధిదినములు పలుమారు నరసికొనుచు
గణనచేయుచుఁ గాలదైర్ఘ్యమ్మునకు న
సూయచెందుచుఁ గుందుచు నాయశోది
కాతనయుఁగూర్చి కాలమ్ము గడపునంత. 19

ఉ. వచ్చిరి రాజపుత్రు లనివారణవారణులై తురంగరం
గచ్చతురంగులై జయదఖండరథోద్ధతులై నిరస్తవి
ద్యుచ్చలనాసిభాసురకరోద్ధురసారసనాదిసాదిభా
స్వచ్చతురంతయానవిలసత్పరివారజనానుయాతులై. 20

ఉ. అంగజతేజుఁ డుజ్జ్వలితహారకిరీటమణీవిభూషణా
భంగురకాయుఁ డాయతకృపారసబంధురమానసుండు వ
చ్చెం గమలాక్షుఁ డుత్సుకత చెన్నలరార రథాధిరూఢుఁడై
మంగళసంగతంబయిన మద్రధరాధిపురాజధానికిన్. 21

ఉ. నెచ్చెలు లేగియంత ధరణీవరపుత్రికఁగాంచి "వచ్చె వి
వ్వచ్చుని బావ'' యంచుఁ దెలుపన్ వలపంకురమంది యంతలో
హెచ్చి మనోవికారము లనేకములన్ సృజియించె నేమనన్
వచ్చును, బచ్చవింటిదొరవైఖరు లాఁగఁగ నేరిశక్యమౌ! 22

చ. ఒకతె వచించు నావెనుక నొక్కతె సెప్పు ననంతరంబు వే
ఱొకతెయు మీఁద నొక్కతయు నొక్కతె చెప్పినమాట వేఱొక
ర్తుక మదినెంచ కిట్లుపలురూపులఁ జెప్పిరి మద్రిరాజక
న్యకకు మురారిరాక, శుభమౌనెడ వార్తల పౌనరుక్త్యముల్. 23

సీ. హరివచ్చెనని చెప్పె ననుఁగు నెచ్చెలియొర్తు
సరసిజాక్షుండనె సకియయొకతె
పద్మనాభుండనెఁ బడఁతిమిన్న యొకర్తు
వనమాలియనెఁ జంద్రవదనయొకతె
బర్హిభూషణుఁడనెఁ బద్మనేత్ర యొకర్తు
చక్రహస్తుండనెఁ జానయొకతె
వేణుభాసురుఁడనె వెలఁది యింకొక్కర్తు
కౌస్తుభాన్వితుఁడనెఁ గాంతయొకతె
తే. గీ. కలికియొక్కతె శ్రీవత్సకలితుఁ డనియె
నతివయొక్కతె పీతాంబరాఢ్యుఁ డనియె
యదుకుమారకుఁ డనె నొక్కయంచయాన
కృష్ణుఁ డనిచెప్పె వేఱొక్కకీరవాణి. 24

తే. గీ. ఎచటఁజూచిన రాజన్యు లెచట దృష్టి
నించినను గుఱ్ఱముల్ గజానీకములును
నెచటఁ గనుఁగొన్న రథము లిట్టెల్లయెడల
దంతురంబయ్యె మద్రపురాంతరంబు. 25

క. అంత బృహత్సేనధరా
కాంతుం డెల్లరకుఁ దగినగౌరవములతో
నెంతయు సన్మానించి య
నంతరమున మత్స్యయంత్ర మాసాదించెన్. 26

ఉ. పిమ్మట రాజులెల్లఁ బృథివీపతి పిల్వఁగఁబంపమత్స్యయం
త్రమ్ము సమీపమందుఁ గల రచ్చనెలర్చెడి చంద్రకాంత పీ
ఠమ్ములఁ దారతమ్యము గడల్కొన నూల్కొని రంబుజాక్షుఁడున్
సమ్మతినెక్కె నొక్కవిలసన్మణిపీఠ మవార్యచర్యుఁడై. 27

ఉ. చూచెడివారు, యంత్రమిది చోద్యమటంచుఁ దలంచువారు, "నా
రాచపువిద్దెకుం దగినరచ్చ యిదే" యనువారు, "వారిలోఁ

జూచుచు దీనిఁ గొట్టవలెఁ జూచినఁ గా" దనువారు, "వహ్వారే
రాచకొమార్త నేలఁగల రాజెవఁడో" యనువారు భూపతుల్. 28

మ. వయసొక్కింత యతీతమౌ నృపతులన్ వాలాయ మీక్షించి లే
వయసుఁ రాజకుమారు లందఱును నవ్వన్ జొచ్చి రాశ్చర్యమూ
వయసుల్ డస్సినమీఁదఁ గన్నియలపై వాంఛల్ పిసాళించువా
రి యయోగ్యస్థితు లేరికేనియును బూరించున్ రసాభాసముల్. 29

ఉ. నందకుమారు రాకకతనం దెలివొందిన మోముతోఁ గన
త్సుందరమందహాసకలతోఁ దులఁదూఁగుచు గండపాళి నిం
పుందళుకొత్తు నున్ విరహపుం దెలిచాయలతోడ లక్షణా
చందనగంధి వచ్చె సరసంపుగతిన్ మితభాషితస్థితిఁ. 30

ఉ. గాదిలి రాచకన్నియ నెగాదిగఁ జూచుచు రాకుమారు "లీ
మాదిరి సుందరీమణి విమానచరప్రమదాళులందుఁ గా
కోదరరాజసంభవతలోదరులందును లే" దటంచు నా
మోదము సందియమ్మును బ్రమోదమునుం గని రందఱుందగన్. 31

ఉ. అంత నృపాలకుం డొకఁడు హస్తమునన్ ధనువుఁ ధరించి య
త్యంతము నేర్పుగల్గినటు లాకసమందలి మత్స్యయంత్ర మొ
క్కింతగ నీటఁ జూచి శరమేసెను బారెడు హెచ్చు తగ్గుగా
"నెంతటి వింటి విద్య" యని యెల్లనృపుల్ దనుఁ జూచి నవ్వఁగన్. 32

ఉ. ఇంచుక తుస్సిపోవ నొకఁడేసె; మఱొక్కఁడు లక్ష్యమెద్దియో
యెంచక బాణముం జెఱిచె; నేమనవచ్చు! నొకండు లక్షణా
చంచలనేత్రపై మనము జాఱినవాఁడగుటన్ మఱొక్కచో
నించె శరంబు, నందఱును నివ్వెఱఁగంది తనుం గనుంగొనన్. 33

శా. అంతన్ గంతునిఁగన్న తండ్రి సురకాంతానందసంధాయియై
ప్రాంతస్థావనిపాలకుల్ శిరములన్ వంపన్ సశంపాంబుద
భ్రాంతిం దెల్పుచు బంగరుంబటము పైపై జాఱ సందీపితా
శాంతుండై యవలీలమైఁ దునిమె మత్స్యాకారమున్ యంత్రమున్. 34

ఉ. త్రుంచినయంతమాత్రమున దుందుభు లాకసమందు మ్రోసె వా
యించి రనేకవాద్యముల నిచ్చట నచ్చట నచ్చరల్ ప్రశం
సించిరి లక్షణాసతియుఁ జెచ్చెరవచ్చి మధూకమాల నుం
కించి తగిల్చె సిగ్గిలుచుఁ గృష్ణునికంఠమునందుఁ బొందుగన్. 35

వ. ఇట్లు లక్షణ కృష్ణువరించుటయు నచ్చటి రాజులందఱును

ఉ. గొల్లఁడు రాచకన్నెను దగుల్కొనిపోవఁగ రాజులార ! మీ
యుల్లములందు సిగ్గువడ కూరక పోయెదరేల ? రండు భీ
తిల్లుట రాచపాడియె ? మదించిన వీనిమదం బడంచి యీ
పల్లవపాణికిం దగినవానికిఁ బెండ్లియొనర్తుమం చొగిన్. 37

చ. తవతవమీఱఁ గొందఱు కటారులుదీసిరి; కొంతమంది క
న్గవనెఱసంజచాయ లొలుకన్ ధనువుల్ శరముల్ ధరించి ''త
క్కవగనలేక గొల్లనికిఁ గూఁతు నొసంగుదురయ్య ! యేటిరా
జ'' వనుచు మద్రభూపతిని సారెకు దూఱఁగడంగి రెంతయున్. 38

వ. ఇట్లు రాజులందఱును నొక్కపెట్టి హరిపైఁ గవయుటయు

సీ. బవరమ్ము వచ్చె దైవమ ! యంచు లక్షణా
సారసాక్షికి గుండెజల్లుమనఁగ
రాజవైరంబు సంప్రాప్తించెనని మద్ర
ధరణీశునకుఁ గాళ్లతడఁబడంగ
మీనయంత్రము ద్రుంపలేనిరాజుల కేటి
పౌరుషంబని పౌరవరులు దూఱ
నీరాజమణు లెంతయీసుమానిసు లంచుఁ
జదల గీర్వాణు లాశ్చర్యమంద

తే. గీ. పట్టుపుట్టంబు నడుమున బిట్టుచుట్టి
హరిణతతిమీఁద దుముకు సింహంబుపగిదిఁ
జక్రి మొకకేల ధరియించి సరసిజాక్షిఁ
దవనిపాలురపై నిర్భయముగ నుఱికె. 40

వ. ఇట్లుఱికి సంవర్తసమయ ధారాధరమ్ము వడువున శరాసారమ్ములంబ
అపి చీకాకు గావించిన

ఉ. ఆనృప వీరులందఱు స్వయంవరవైఖరు లెంచికొంచు లో
లోనఁ జలమ్ము లజ్జయును లోలతయున్ దలవంపునింప ము
న్మానినమార్గముంగొని త్వరోద్ధరులై చని; రంత నాబృహ
త్సేనుఁడు గృష్ణఁ దోడికొని సేనలు గొల్వఁగ నేగెఁ గోటకున్. 42

తే. గీ. అంతలక్షణకును జలజాక్షునకును
మంగళస్నాన మొనరించి రంగనాజ
నములు మంగళవాద్యముల్ గొమరుమిగుల
వేదఘోషమ్ము లందంద విస్తరిల్ల. 43

మ. తలయంటెన్ జలజాక్షియొక్కతె లలత్తైలమ్ము కంసారికిన్
నలుఁగుంబెట్టె మఱొక్కలేమ హరికి న్నాణెంపుఁ గాలాగురున్
జలకంబార్చె నిఁకొక్కచాన హిమవాస్సారమ్మునన్ జక్రికిన్
జెలి వేఱొక్కతె నున్ గురుల్ దగ విదిర్చెన్ గోరులన్ దువ్వచున్.

తే. గీ. మురిపెములనొప్పు నవ్వధూవరుల నుచిత
భూషణాంబరముల నింపుపుట్టఁ దగ న
లంకరించి యథోచితలక్షణముల
వేదిఁ గై సేయఁజేసిరి పేరటాండ్రు. 45

క. శ్రుతిహితముగ నతులితముగ
ధృతకుతుక స్వాంతులగుచు ద్విజులు శుభసమ
న్వితగతిఁ బెండ్లియొనర్చిరి
సతీపతులకిర్వురకు నెసకమెసఁగంగన్. 46

శా. కట్టెన్ గేలు సెమర్ప మానసము పొంగన్ గోర్కులాకాశమున్
ముట్టన్ మంగళసూత్రి మంగజకళాపూర్ణుండు గృష్ణుండు మేల్
రెట్టింపన్ దగు లక్షణాగళమునన్ లీలామహావాద్యముల్
ధట్టింపన్ దదుదారదివ్యతరసౌందర్యమ్ము నీక్షించుచున్. 47

ఉ. "నాతి చరామి" యన్న వచనార్థమెఱుంగునొ, లేదొ! యమ్మురా
రాతి పఠించి యచ్చెలిశిరమ్మున హస్తము పెట్టి బిట్టుపే9
మాతిశయమ్మునన్ గురువరానుమతిన్, బదియాఱువేలపై
చేతులఁ దక్కు భార్యలఁ ద్యజింపఁ దలంచెనొ లక్షణార్థమై! 48

తే. గీ. మురిపె మొక్కింత లోనఁ దత్తఱ మొకింత
సందియ మొకింతయును సంతస మ్మొకింత
గలసి యొకవింత పుట్టింపఁ జెలియమిన్న
వల్లవీలోలుపైఁ దలఁబ్రాలువోసె. 49

సీ. మంగళం లక్షణామానినీకమనాయ
మంగళం త్రైలోక్యమండనాయ
మంగళం వల్లవీమానసాధారాయ
మంగళం యదువంశమానితాయ
మంగళం గోగోపమండలత్రాణాయ
మంగళం మౌనిసంభావితాయ
మంగళం సత్యభామాపదానుచరాయ
మంగళం రాధికామన్మథాయ

తే. గీ. మంగళం మంగళం గోపపుంగవాయ
మంగళం మంగళం సర్వమంగళాయ
మంగళం మంగళం మృదుమానసాయ
యనుచు నారతులెత్తిరి వనజముఖులు. 50

తే. గీ. శ్రుతిహితమ్ముగ విప్రులు శ్రుతులు సెప్పఁ
బుణ్యసతులెల్ల మంగళమ్ములను బాడ
వెలవెలందులు నాట్యముల్ విస్తరింప
లక్షణను బెండ్లియాడెఁ బద్మేక్షణుండు. 51

తే. గీ. ప్రమదమొప్పఁగ నైదుదినములు నేగ
నంత నగరోత్సవమ్ము చేయంగఁ దలఁచి

మించు సదలంకృతులను భూషించిరెలమి
లక్షణాతరుణీసరోజేక్షణులను. 52

సీ. మల్లెమొగ్గలువెట్టి మణిసరమ్ములుచుట్టి
జడకు సింగారమ్ము గడలుకొల్పి
రతనంపునత్తు వజ్రిపుబులాకీ పొత్తు
గలిపి నాసకు వింతచెలువుగొలిపి
పలుహారములచేతఁ బచ్చికస్తురిపూఁత
గుబ్బచన్నులకు మేల్ గుస్తరించి
దొడ్డచీర లగించి యొడ్డాణముబిగించి
లేఁత నెన్నడుమున కూఁతయొసఁగి
తే. గీ. పసపు పూసియుఁ బారాణియొసఁగి పదస
రసిజములకుఁ బసందగు పస ఘటించి
పలుచనగుగతి బాహులఁ గలప మలఁది
లక్షణ నలంకరించిరి లక్షణముగ. 53

సీ. పలుఫలాహారముల్ చలువపన్నీరు మే
లత్తరుల్ చిత్తరుల్ హాళినొలయ
నెత్తంపుఁబలకవీణియ తమ్మలంపుఁజి
ల్కాలు పూలబంతులు మెలపుదెలుప
చిటిచాఁప చెలువునించెడు పట్టుదిండియల్
బంగారుకలశముల్ పసనెసంగ
ముక్కాలిపీఁట బల్ చక్కని కుర్చీలు
నేడ్లు గులోబులు చెలువుమలప
తే. గీ. దోమతెర జోడు పటుపులతోఁ జెలంగు
బంగరుంబని దంతపుఁబట్టెమంచ
మందు సింగారముగ యదునందనుండు
చెలువపై మది బరుగిడ నలరుచుండె. 54

తే. గీ. అంత లక్షణఁ దోడ్కొని యనుఁగుఁజెలులు
కేళికాగారతోరణపాళిదరికి
పోళిఁ జెన్నార నొక్కొక్కయడుగువరుస
నరిగి లక్షణ కనిరి హాస్యంపుగతుల. 55

ఉ. "ఎన్నఁడుగాని కన్నియల హేలలెఱుంగని వన్నెలాఁడు మా
వెన్నుఁడు వెఱ్ఱిగొల్ల, పృథివీపతిపుత్త్రిక వీవు వన్నెలుఁ
జిన్నెలు నేర్చుదాన, వెటుచెల్లునొ మీకుఁ బరస్పరం" బటం
చు న్నళినాక్షి నెంచె నొకసుందరి కృష్ణునెఱుంగ నట్లుగన్. 56

క. "పలుసుదతుల చేతులలో
మెలఁగినవాఁ డతని నెట్లు మెప్పించెదొ ? యో
కలికీ" యని వేఱొక చెలి
పలికెన్ గలమాట తెలుపుభంగి పొసంగన్. 57

క. "పలుపలుకు లేల, రాధా
లలనయనన్ మదనశాస్త్రలక్షణవతి యా
వెలఁదుకకు దాసుఁడై కడు
నలిఁగినవాఁ డతఁడు మెచ్చునారులు గలరేః" 58

క. అని పలువిధములఁ జెలు ల
న్వనజానన గేలిసేయ వనజముఖి యొక
ర్తను "నతఁడు నేర్చికొనె మన
వనితయు నేర్చికొను నతనివలనఁ దనంతన్." 59

తే. గీ. "నేర్చికొననేల ? వన్నెచిన్నె లన వయసుఁ
బడుచులకు నెల్లరకును స్వాభావికమ్ము"
లనుచుఁ దమలోనఁదమ రాడుకొనుచు నొయ్య
నొయ్య శయ్యకుఁదార్చి రయ్యువిద నెలమి. 60

తే. గీ. సిగ్గునను మ్రగ్గుచున్న యచ్చెలియ గృష్ణు
దరికి రాఁదీసి యొకప్రోఁడదనపుఁ గలికి

పలుకులం దెంతయును నేర్పు దొలకరింప
నింపులు జనింప నతనితో నిట్టులనియె. 61

సీ. పర్వతమ్ములుగావు పడఁతివక్షోజమ్ము
లలరుగుత్తులుసుమీ యద్రిధరణః
కాలసర్పముగాదు కలికికీలుజడయ
శికులమాలసుమి కాళీయదమనః
కరికరమ్ములుగావు కలికినుందొడ లంటి
స్తంభముల్ సుమ్ము కంసకరిహరణః
చక్రిముల్ గావు మాజలజాక్షి పిఱుఁదులు
సైకతమ్ములు సుమీ చక్రిహస్త!
తే. గీ. మోవి సుమ్మిది పిల్లనగ్రోవి గాదు
రాతనయ సుమ్ము చల్లమ్ము వేత్రి గాదు
తెలుపుమర్యాద గావునఁ దెలుపుచుంటి
మెఱుఁగవా? రుక్మిణీసతీహృదయలోలః 62

వ. వేఱొక కీరవాణి లక్షణకు మెల్లన నిట్లనియె.

సీ. నూటికొక్కటికైన మాటకుత్తరము నీ
వలెఁగాని యూరకోవలదు సుమ్ము
కెమ్మోవియానసుంకించిన నొయ్యనీ
వలెఁగాని డాఁచుకోవలదు సుమ్ము
పుక్కిటవిడెమీయఁబోయిన నందుకో
వలెఁగాని వెలిఁజేయవలదు సుమ్ము
కాఁగలించుకొనంగ గమకింప నెదురొత్త
వలెఁగాని వెనుదీయవలదు సుమ్ము
తే. గీ. చిత్తమున కనుగుణముగఁ జెలఁగవలయుఁ
గాని యొక్కెడనైన నొక్కత్రుటికన్నఁ
బెనఁగులాడఁగవలదుసు మ్మనుఁగుకాఁ డ
నంగ దైవమ్ముసుమ్ము సన్నుత లతాంగి. 63

తే. గీ. ఇటులఁ దగుభంగులన్నియు నెఱుఁగఁజేసి
"యాతఁడున్నాఁడు, నీవుంటి వతివమిన్న !"
యని పయికిఁజెప్పి యొక్కొ-కపని నెపమునఁ
జనిరి చెలికత్తెలంద ఆ స్థలమువిడిచి. 64

శా. కేలంటెన్ బెరకేలువట్టె మెయి సోఁకించెన్ మెయిన్ గంఠమున్
గీలించెన్ గుచసీమ మంజులగతిన్ గేలుంచె గండస్థలిన్
లాలించెన్ దగఁగౌఁగిలించె మధురాలాపమ్ములన్ దేల్చెఁ గే
శీలోలుండయి మించె శౌరి కడుబాళిన్ లక్షణాభామతోన్. 65

మ. అకృతప్రత్యయ మప్రియుక్తవచనం బప్రాపితాలింగనం
బకనద్బంధ మచుంబితాధర మసంప్రాప్తావకాశం బదృ
శ్యకటాక్షంబగు లక్షణానవరతం బానందముంగూర్చె శౌ
రికి, ముగ్ధారతసౌఖ్యసంపదలు వర్ణింపంగ రా వేరికిన్. 66

*సీ. ఎందఱీడ్చిన సెజ్జయిల్లు చేరనిబోటి
చేరి వాకిలి యోరఁజేయనేర్చె
నెంతవేఁడిన మొగంబెత్త నేరనిచాన
యెత్తిచిఱ్ఱునగవు పల్లొత్తనేర్చె
నిందమంచును విడెమ్మీయనేరనిలేమ
యిచ్చి వా తెఱ యానసీయనేర్చె
చెయివట్టిలాగిన సెజ్జయంటనిగోల
యంటి తోఁ బన్నుంట యదియునేర్చె
తే. గీ. ముట్టినంతన మ్రాన్పడు ముద్దరాలు
మ్రాన్పడక పిలొసఁగనేర్చె రతికొకింత
యౌర! యేరీతిమాఱెఁ జేతోంతరంబు
నాతికన్నెరికమ్మ రెండవదినమున. 67

తే. గీ. ఎఱిఁగియు నెఱుంగకుండెడి సురతసుఖము
నొసఁగియు నొసంగకుండెడి యోష్ఠరసము

* ఈసీసము, మిత్రమగు, ఆదిపూడి ప్రభాకర కవిచే రచింపఁబడినది.

పలికియును బలుకకయుండు పలుకు తళుకు
కన్నియలకూటముల నెన్నఁగాఁ దరంబె ! 68

క. ఈగతి నాగజగమనా
భోగమయుండగుచు మదిపురమునఁ గృష్ణుం
డాఁగె నొక కొంతకాలము
భోగం బెఱుఁగంగనీదు పురుషార్థమ్ముల్. 69

తే. గీ. ముగ్ధయై కొంతకాలంబు మురువుసూపె
మధ్యయై కొంతకాలంబు మది గరంచె
ప్రౌఢయై కొంతకాలమ్ము ప్రమదమొసఁగె
లక్షణాచంద్రిముఖి సరోజేక్షణునకు. 70

ఉ. ఆ యదునందనుం డిటులు హాయిగ నాయలివేణిఁ గూడి ని
త్యాయితసౌఖ్యముల్ గొనెడి యాసమయమ్ముననైన రాధికా
తోయజనేత్ర యాడిగల తొల్లిఁటి ప్రేమలచెల్మి లెంచు; నే
చాయల నేరికి న్మఱవ శక్యమె, తొల్లిఁటినాఁటి కూటముల్. 71

ఉ. శ్రీయవతారమై పొలుపుచెందెడి రుక్మిణియుండ సత్యభా
మాయతనేత్రి యుండఁ దగులాటపునెచ్చెలు లుండ రాధికా
తోయజనేత్రి సంగతులఁ దోయజలోచనుఁ డెంచి మించి యో
హో! యనిసొక్కు; నొక్కయెడ నొక్కనిమానస మట్లు చిక్కెడున్.

తే. గీ. ఇటుల జలజాక్షునకు "బొంది యిచటఁ, బ్రాణ
మచట" ననునట్టి సామెత యనువుపడఁగ
నంత నేతెంచెఁ దగ శరదాగమంబు
కలితకాదంబినీకాంతివలిత మగుచు. 73

సీ. తెలుపెక్కె మేఘముల్ బలుపెక్కె ఋక్షముల్
తళుకెక్కెఁ దారావితానములకుఁ
బొలుపొందెఁ జంద్రుండు తెలివొందె దిక్కులు
కాశసూనములు ప్రకాశమందెఁ

బసమీఱెఁ బద్మముల్ వెలఁదేఱె నీరముల్
మల్లియల్ పుష్పించి వెల్లివిరిసెఁ
జెలరేఁగె విరహముల్ తులఁదూఁగె సస్యముల్
గాలికిఁబ్రాగ్దిశాగమన మొదవె
తే. గీ. నెండ మెండయ్యెఁ గొండలు పండువయ్యెఁ
జలి మొలకలెత్తెఁ దూర్పువర్షములు మొత్తె
నేఱులు కృశించెఁ దిన్నియల్ తారసించె
సురతరుచి హెచ్చె దివికి భాసురతవచ్చె. 74

తే. గీ. అట్టి శరదాగమమ్మునం దంతకంత
కధిక మగుచు విరాళి రాధాంగనాశి
రోమణీచర్య లెంచి కూరుములు పెంచి
కృష్ణు నుంకించి తాల్మి జంకించె బళిరె. 75

ఉ. "ఎందఱనైనఁ జూచితి నిఁ కెందఱనైననుఁ జూడ నుంటి నో
సుందరి! నీదుచందమును సొంపును నింపు దలంపు నింపు నే
మందు నవారవిందవదనా! పద నాయెద నాటఁబోకు మె
న్నందగుదాన వెంతకయినన్ బయి నట్టె దయ నంది చూతువే. 76

చ. మన గిలిగింతలున్ మనదు మర్మములున్ మన తాఱుమాఱులున్
మన పొలయల్కలున్ మన మనమ్ములనుండెడి వింతకోర్కెలున్
మనమన నర్మవాక్యములు మన్ననలున్ మరియాదలున్ మన
మ్మున నెపుడైనఁ గాని తలపోయుదువే? సరసీరుహాననా! 77

ఉ. పద్దికమీఱ నాఁడు తగువైఖరిగా మితభాషితాంగివై
యద్దమరేయివేళ దళమైతగు వెన్నెలలోన నీవు నా
యొద్దకు వచ్చి కౌఁగిలిడి యొక్కటియే కద ముద్దువెట్టి, తా
ముద్దుఋణమ్ము దీర్చుటకు మూఁడుయుగమ్ములు పట్టు నెచ్చెలీ! 78

సీ. అర్ధక్షణంబేని యంతరాయములేని
వింతవింతల కౌఁగిలింతలార!

తమినెఱుంగక పొంగు తమకమ్మునసెంగు
హద్దుపద్దులులేని ముద్దులార!
తడఁబాటు తఱిడాసి యొడలు నీరుగఁజేసి
పొగరుచూపెడి గుబ్బపోటులార!
లేనితప్పులు చుట్టి పోనికూరిమిఁబట్టి
తవతవఁ దగు చపేటమ్ములార!
తే. గీ. తియ్యఁదియ్యనికెమ్మోవితేనెలార!
నిరుపమానపు దొంతరనిద్రలార!
తమి నెఱుంగని పురుషాయితమ్ములార!
రాధికా కృష్ణులను విడరాదు సుండు. 79

తే. గీ. ఒడలెఱుంగని పేర్మిఁ బైఁబడెడి పడఁతి
పలుకుపలుకునకుం దేనెలొలుకు కలికి
గిల్లినను పాలుగాఱెడి పల్లవోష్ఠి
పొందు గలవాఁడె పో పుణ్యపురుషుఁ డిలను. 80

ఉ. ముద్దుల చేష్టలన్ మఱచిపోతి; సుతారపుఁ బూరుషాయితం
బెద్దడియాయె; సోయగపుహేలల కేమి, జగమ్మునన్ మఱే
ముద్దియ కుండ కుండు; వలపున్ మొలపింపఁగఁజేయుశక్తి నీ
యొద్దన పుట్టె వేఱొక తలోదరి నీసరిఁజేయ నేర్తునే. 81

ఉ. నేరుపెఱుంగనట్టి నను నీవకదా! కడుఁ బెద్దఁజేసి యా
యా రతిరీతులందలి యొయారములన్ గడిదేర్చి యెంతయున్
బారగుఁజేసి యేలితివి పద్మదళాక్షిరో! నిన్నుఁ బాయఁగా
నేరుచు బల్ కృతఘ్నుఁడను నేరము లెన్నకు మిట్టి నాపయిన్. 82

సీ. నాఁడుగా! నిరుపమానందంపు టందంపుఁ
జందంపుఁ బొందికల్ పొందుపడుట
నాఁడుగా! మిగుల విన్నాణంపు నాణెంపు
రాణంది రాణించు రస మెసఁగుట

నాఁడుగా! యమునాకనత్తటిన్యుత్తటా
త్యుత్కటస్ఫుటకేళి లీలఁ బొగనుట
నాఁడుగా! రుచిరబృందావనాసేవనా
ధావనాభావనాధాటి గనుట
తే. గీ. నాఁడుగా, ఘనవేణుగానముల సొగసు!
నాఁడుగా, క్రీడగావించు ప్రోడతనము!
నాఁడుగా, వేఁడఁగా బాడి నను దనుపుట!
నాఁడు గల చిన్నె లన్నియు నేఁడు గలవె!" 83

చ. అని పలుమారు నెమ్మనమునందుఁ దలంచునకాని లక్షణా
వనజముఖీలలామ విడువం గమకింపఁగలేఁడు శౌరి, యే
మనఁదగుఁ? బల్వెలందులకు నాసలుచేసెడివారి చిత్తవ
ర్తన, తరణిద్వయార్పితపదద్వయిచందము గాక యుండునే. 84

తే. గీ. యిటులు మది రెండు దెఱఁగులై యేఱుగట్టు
చుండినను లక్షణ యెఱుంగకుండఁ గృష్ణుఁ
డనయమును వింతవింతలఁ దనుపుచుండె
నెంతప్రోడయుఁగాకున్న నిందఁజేల! 85

క. పయనంబని కృష్ణుం డ
మ్మెయి మామ కెఱుంగఁజేయ మెలతన్ బనుపన్
దయ వెన్కఁదీయ నృపుఁ డెం
తయు నాలస్యంబు చేసె ధర్మమ కాదే! 86

సీ. పోవచ్చునంచుఁ జెప్పుచుఁ గొన్నినాళ్లు తం
దరయేమటంచుఁ గొన్నాళ్లుజరిపి
శుభముహూర్తమ్ములఁ జూచుచుఁ గొన్నాళ్ళ
నంతరంబనుచుఁ గొన్నాళ్లుజరిపి
నేఁడు గాదంచు మన్నించుచుఁ గొన్నాళ్లు
నాఁడంచుఁజెప్పి కొన్నాళ్ళుజరిపి

విందులపై మిషపెట్టుచుఁ గొన్నాళ్ళు
తెల్లవారనని కొన్నాళ్ళుజరిపి;

తే. గీ. పసపునకుఁ గుంకుమకుఁ గొంత వసతియొసఁగి
మంచి సుముహూర్తమున బహుమతులొసంగి
కూఁతు నత్తింటి కంపించెఁ గువలయేశుఁ;
డంపుదురె? యంపు మన్నంత నత్తవారు. 87

తే. గీ. సరసిజాక్షుఁడు లక్షణాసహితుఁడగుచు
నరుగు నంతటఁ బురకాంత లతనిఁజూడ
నేగుదెంచి కనుంగొని రెలమి సప్త
భూమికోన్నతసౌధాగ్రములను నిలిచి. 88

చ. "మదనునిఁ గన్నవాఁ డనెడిమాట నిజం" బనె నొక్కనాతి, "నా
రదనుతుఁడంట నిక్కమనరాదె" యటంచనె నొక్కలేమ," మేల్
యదుకుల మింతపుణ్యదశ నందెఁగదా?'' యనె నొక్కసాధ్వి,"యె
ట్లు దగిరి గొల్లలేమ లతిలోకుఁ డితం" డనె నొక్కచానయున్. 89

శా. "గొల్లల్ గొల్లలటన్న గొల్లలటె యాగొల్లల్! తదీయాంగనల్
ఫుల్లాంభోరుహలోచనల్ మృదురదస్ఫూర్తుల్ కనత్కాంతివి
ద్యుల్లేఖల్ కరిరాజమందగతు లిందుభ్రాజదాస్యల్ సుతా
రల్లీలావతు లేల వేయుపలుకుల్ రంభోర్వశీమేనకల్. 90

క. మనవీటన్ జల్లమ్మెడి
వనితలమా టట్టులుంచు వారసతులు నా
వనితల దాస్యమ్మునకై
నను జాల" రటంచు నొక్కనాతి వచించెన్. 91

తే. గీ. ఇట్లు పరిపరివిధముల నెంచికొనుచుఁ
బురసతులు సూడ లక్షణాతరుణిఁ గూడి
ద్వారకకు నేగెఁ గృష్ణుఁ, డాతని యువతులు
తమ్ము వదలుటఁజేసి చిత్తములు గలఁగ. 92

ఉ. ఎన్నఁడువచ్చుఁ గృష్ణుఁ, డిఁక నెన్నఁడు చూడఁగఁగల్గు, వేడ్కమై
నెన్నఁడు కౌఁగిలించుకొను, నెన్నఁడు ముద్దిడు, నెన్నఁడేలు, నిం
కెన్నఁడు తాపమాఱు, మనమెన్నఁడు తిన్నఁబడున్, మనోరథం
బెన్నఁడు తీరునంచు మది నెన్నఁగరాని వియోగవేదనన్. 93

సీ. కృష్ణుసంగతులు నీకించుకేని యెఱుంగ
రావుగా? యని సత్య రాధ నడిగె
జలజాక్షుఁడిప్పు డెచ్చటనుండెనో యెఱుంగఁ
బడెనె? నీ కని రాధ భద్ర నడిగె
మఱచెనో మనలనెల్లరఁ గృష్ణుఁడంచుఁ దా
పముమీఱ నీలతో భద్ర వలికెఁ
గర్ణశృంగఖ్యాతి గనుపట్టె నని నీల
పతి చందమెంచె జాంబవతితోడ
తే. గీ. రుక్మిణీదేవి కెఱుక యీరూఢివ_ర్త
మాన మనుచు సుదంత జాంబవతి కనియె
నిటులు పలువిధములను వారెల్లఁ దల్ల
డించి పలవించసాగిరి మించుపేర్మి. 94

ఉ. అందఱకన్న రాధ పడునా_ర్తివచింపఁ దరంబుగాదు కృ
ష్ణుం దలపోసి మండిపడు సోయగ మెంచి తలంకు సారెకున్
గుందు "దయావిహీను నెటుకూడితి నే" నని మాటిమాటికిన్
నిందయొనర్చుఁ; గూర్మి పరనీరజనేత్రల కెక్కుడౌఁగదా! 95

చ. "గతియననెట్టిదో యెఱుఁగరాని తనున్ మదనాగమాంతపం
డితునిఁగఁ జేయుటెల్ల నొకనీరజనేత్రకు నొప్పుఁజెప్ప నం
చతఁడు మదిం దలంచెనొ? దయాళునిఁగా నెదనమ్మితిన్ గృత
ఘ్నత లెఱుఁగంగవచ్చునె? కనంబడు నంతటిదాఁక నేరికిన్. 96

ఉ. కప్పుకొనంగ నాపయఁటఁగాని మఱొక్కటినొల్లఁ దెవ్వరే
జెప్పినమాట నాకెఱుఁగఁజేయక నిద్దురవోఁ దొకప్పుడున్

గప్పురవీడె మొక్కఁడయికై కొనఁ డామురిపెమ్ము లన్నియున్
దప్పెనొ ? యెల్లకాలమొకత్రాటను బోదురె జారపూరుషుల్ ! 97

ఉ. వల్లభు నొల్ల కన్వయమువారికి లోఁగక లోకు లాడు నా
యల్లరిమాట లోర్చుకొని యన్నిఁటికిం దెగదెంపు చేసి యీ
కల్లరి సౌఖ్యమే సతముగాఁ దలపోసి పరున్ వరించు నా
హల్లకపాణికిన్ జెడుట యబ్రమె ? పున్నెముఁ బూరుషార్థమున్. 98

సీ. రాకాశరచ్చంద్రరాజమానానూన
చంద్రికాఫలితవృక్షమ్ములార
వికసత్కుసుమగుచ్ఛవిహరమాణాతిగుం
జన్మధువ్రతనికుంజమ్ములార
వివిధశృంగారభావితహంసతూలికా
తల్పవత్కేళి సౌధమ్ములార
మలయమారుతపోతవలనానుకలనావి
తతయమునాసైకతమ్ములార
తే. గీ. మా వినోదంపుఁ జెయ్వులు మంతనములు
కష్టసుఖములు మీరెఱుంగనివికావు
మీరలైనను నాదుపేర్మినిగణించి
వెదకి వేవేగఁ గృష్ణు రప్పింప లేరె." 99

క. అని పలువిధములఁ దలఁచుచు
వనజానన యుండె; నంత వనజాక్షుఁడు రా
ధ నెపుడు గనుఁగొందునొ యం
చును వచ్చెన్ దన్ను గొల్లసుదతులు చూడన్. 100

చ. అదె ! ప్రియుఁడేగుదెంచె; జలజాక్షుఁడువచ్చె; మనోహరుండు నా
కదె ! కనుపట్టెనంచు వనజాననలందఱుఁ జెప్పికొంచు నీ
రదరుచిభాసురున్ హరిఁ గరమ్మనుజూచిరి వాచినట్లు, నె
మ్మదు లతివేలహర్షగరిమన్ భరమూని వశంబుతప్పఁగన్. 101

ఉ. వచ్చినకృష్ణుఁజూచి వృషభమ్ములు నాలును గోపబాలురున్
హెచ్చినవేడ్క నూరికడకేగిరి ద్వారకయున్ బ్రిమోదముల్
పిచ్చిలునట్లుతోఁచె నిటు వేణువిశారదుఁ డేగుదెంచుచో
నిచ్చలు రాధపైఁ బరుగులెత్తఁగఁ దత్తర మావహింపఁగన్. 102

చ. గడియకొ. లేక యొక్క యరగంటకొ కంటఁబడున్ బ్రియంబు చా
ప్పుడఁ దగఁ గౌఁగిలించుకొను బల్ వలపూరఁగ ముద్దువెట్టు నె
క్కుడు తమకమ్మునన్ మరునికూటములన్ గరఁగించు నింకఁ దుం
దుడుకును మాను మయ్యదియు తొయ్యలి కేళిగృహంబు చిత్తమా. 103

క. ఆరాధకేళిసదనము
తారసమగుకొలఁది నిట్లు దనుజహరునకున్
దోరంబగుఁదత్తర, మది
ధారుణి ననుభూతమగు విధం బనరాదే. 104

ఉ. ద్వారము చేరునంత దరిదాపున నారసి రాధికాసఖుల్
గేరుచు లోనికేగి "సఖి కృష్ణుఁడు వచ్చె" నటంచుఁదెల్ప నం
భోరుహనేత్రి నమ్మ కటుఁబో గమకింపఁ దలంచునంతలో
సారసలోచనుండరిగె సారసగంధి గృహమ్ము చెంతకున్. 105

ఉ. ఇంచుకగాంచి రాధ జలజేక్షణుఁ గంటి నటన్న మోదమో
వంచనచేయు నిచ్చయొ స్వభావమొ కృష్ణునిమీఁది కోపమో
యెంచఁగరాదుకాని చనియెన్ జవుజవ్వనఁ గేళికాగృహా
దంచితశయ్యకున్, వడిగఁ దామరసాక్షుఁడు వెంబడింపఁగన్. 106

క. ఇటుచని యెఱుఁగనిగతి దు
ప్పటి ముసుఁగిడి శయ్యపైనిఁ బవళించిన న
క్కుటిలాలక విధమెఱిఁగిన
విటశేఖరుఁ డరిగె రాధ వెనువెంబడిగన్. 107

ఉ. చనిదరిఁజేరి శౌరి పరిచర్యయొనర్చెనొ "తప్పసైఁపుమీ"
యని బతిమాలసాగెనొ "దయన్ గనుమీ" యని లేనిదైన్యమున్

గనుపడఁజేసెనో, చరణకంజములంబడి మ్రొక్కెనో, వచిం
ప నలవికాదుగాని యలపద్మదళాక్షియుఁ బక్కన న్నగెన్. 108

ఉ. వారివినోదముల్ మఱియు వారిపరస్పరనర్మవాక్యముల్
వారి విలాసపుంబనులు వారలచెయ్వులు వారికూరుముల్
వారల ముచ్చటల్ మఱియు వారల తీరులు నిర్ణయింప నె
వ్వారికి శక్యమౌఁ? గవులు వర్ణనచేసెడిపాటి వారలే! 109

సీ. లక్షణ నీరీతి లాలనచేయుదే?
యన, మంచిదానవే! యనియె శౌరి
యాబోటిపై మనంబతికెనే? యీరీతి
నన, లేదులేదులేదనియె శౌరి
ఆయింతి కీవింత లన్నియునేర్పితే?
యన, వెఱ్ఱివాఁడనే? యనియె శౌరి
ఆనాతి కీప్రీతియమరెనే? నీమీఁద
నన, నించుమించుగా ననియె శౌరి
తే. గీ. ఆలలన యెన్నఁడేని నన్నడిగెనే? య
టన్న, నెఱుఁగునో, యెఱుఁగదో యనియె శౌరి
చెప్పకుందువె? నాతోడఁ జెప్ప వనిన,
నబల! నీకలయిక సాక్షియనియె శౌరి. 110

తే. గీ. ఇటులనే తక్కఁగల సతులెల్లఁ దన్నుఁ
గోపగింపఁగ నందఱకోపములను
రసమెసంగెడిగతి నివారణమొనర్చె
రసికజనశేఖరుం డన రాదె శౌరి! 111

తే. గీ. అష్టభార్యల నేలుచు ననవరతము
గోపికలకోర్కె దీర్చుచుఁ గోరువారి
కిహపరమ్ముల నొసఁగుచు నెసకమెసఁగఁ
గృష్ణుఁడు చెలంగె, వైభవజిష్ణుఁడగుచు. 112

క. ఈలక్షణాపరిణయము
పోలంగా వ్రాసి చదువు పుణ్యాత్ములకున్
శ్రీలలనాధవుఁ డొసఁగుత
మేలగునాయువును సిరియు మేటియశమ్మున్. 113

—• ఆశ్వాసాంతపద్యములు •—

క. ఆఘ్రాతానేకాగమ
వాఘ్రదినీస్నానపూతపండితసుకవి
వ్యాఘ్రప్రణుతకవీంద్రస
మాఘ్రాపితకావ్యసార ! యలఘువిచారా ! 114

శా. శ్రీసత్యాదృతశుద్ధచిత్త ! పరనారీసోదరీభూత ! దు
ష్ప్రాపాహంక్రియ ! గోకిరెడ్డికులపారావారరాకాతమి
స్రాపాలా ! దయమానదీర్ఘనయనప్రాబల్య ! సత్యాదృతా
లాపశ్రీబల ! తాటికొండపురపాలా ! రామభూపాలకా ! 115

మంగళ మహాశ్రీవృత్తము.

శ్రీలలితమందిరవిశిష్టశుభజాలయుత సేవకజనోచితదయా ! గ
ద్వాలనరపాలవరభావుక ! కళాకలితభావుకగుణాకర ! కృతీంద్రా !
తాళనగనామ పురధన్యజనపాల ! జనతావినుతశీల ! నుతగోత్రా
పాల ! శుభరామనరపాల! జయలోల! కవివారనుత మంగళమహాశ్రీ.

— గద్య —

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకళానిధి
బాలసరస్వతీ శతావధాని తిరుపతి వేంకటేశ్వర ప్రణీతం
బగు లక్షణాపరిణయంబను మహాప్రబంధమ్ము
నందు సర్వంబును దృతీయాశ్వాసము
సంపూర్ణము

శ్రీ కృష్ణార్పణమస్తు